http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

శనివారం 14 సెప్టెంబర్ 2024

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.
ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828




## తక్షణ సహాయం అందించండి

- కేంద్ర బృందానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి
- వరద నష్టం అంచనాపై కేంద్ర బృందంతో రేవంత్ రెడ్డి భేటీ
- సచివాలయంలో సీఎంతో కేంద్ర బృందం సమావేశం
- వరదల నివారణకు శాశ్వత నిధిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని సూచన

హైదరాబాద్

రాష్ట్రంలో వరదలతో నష్టంపై పలు విజ్ఞప్తులను కేంద్ర బృందం దృష్టికి సీఎం రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. వరదలతో తీవ్ర నష్టం జరిగింది. వరదల నేపథ్యంలో ఎలాంటి నిబంధనలు లేకుండా తక్షణ సాయంగా నిధులు విడుదల చేయాలని కోరారు. ఖమ్మం మున్నేరు వాగుకు రిటైనింగ్ వాల్ నిర్మించడమే అక్కడ వరద - మిగతా3లో

## అధికారం పోయిందనే అక్కసుతో కుట్రలు




- లా అండ్ ఆర్డర్ పట్ల సీఎం రేవంత్ సీరియస్
- శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు
- డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు..
- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేలా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటాం
- శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదు
- తెలంగాణలో పరిస్థితిని చెడగొట్టేందుకు ప్రయత్నించే వ్యక్తులపై జీరో టాలరెన్స్

హైదరాబాద్

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మధ్య జరిగిన మాటల యుద్ధం ఏ రేంజ్‌లో ఉత్కంఠ రేపిందో అందరికీ తెలిసిందే. గాంధీ ఇంటి ముట్టడికి బీఆర్ఎస్ పిలుపునివ్వడం మరింత కలకలం రేపుతోంది. ఈ క్రమంలో రాష్ట్ర రాజకీయాలు, ప్రస్తుత పరిస్థితిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పట్ల ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. అధికారం కోల్పోయామనే అక్కసుతో కొందరు శాంతి భద్రతలకు విఘాతం కల్పించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా రకరకాల కుట్రలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి - మిగతా3లో

## ఎమర్జెన్సీని తలపించేలా కాంగ్రెస్ పాలన



- ఈ దాడుల కుట్రదారు రేవంత్ రెడ్డినే : హరీశ్‌రావు
- రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి
- ఎవరి మీద దాడులు చేయాలని రివ్యూలు చేస్తారా..?
- పదేళ్లపాటు శాంతి భద్రతల సమస్య రాకుండా బీఆర్ఎస్ పాలన సాగింది
- కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్తోంది
- శాంతిభద్రతలు క్షీణిస్తుండటంపై పెట్టుబడిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు
- డీజీపీ, పోలీస్ ఉన్నతాధికారులకు హరీశ్ రావు సూచన
- డీజీపీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్న హరీశ్ రావు
- గతంలో రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేయడానికి వెళితే పోలీసులను తిట్టారని ఆరోపణ
- తప్పు చేయాలని రేవంత్ రెడ్డి చెప్పినా చట్టబద్ధంగా వ్యవహరించాలని హితవు

హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపించేలా ఉందని, ఈ దాడుల కుట్రదారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. కోకాపేటలోని తన నివాసంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీనికి కారణం ఎవరైనా ఉన్నారంటే రాష్ట్రం సీఎం రేవంత్ రెడ్డినే. చేసిందంతా చేసి ఇవాళ సీఎం శాంతి భద్రతల మీద రివ్యూ చేస్తారట. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కాపాడానికి కఠినంగా వ్యవహరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ జితేందర్ ప్రెస్‌నోట్స్ ఇచ్చారు. నిన్న అరికెపూడి గాంధీకి అడిషనల్ డీసీపీని ఎస్కార్ట్‌గా పెట్టి 8 పోలీసు స్టేషన్లు దాటించి కౌశిక్ రెడ్డి - మిగతా3లో



### జైలు నుంచి అరవింద్ కేజ్రీవాల్ విడుదల

- సీబీఐ, ఈడీ కేసుల్లో కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ అత్యున్నత ధర్మాసనం తీర్పు
- కొంతకాలంగా జైలు శిక్ష అనుభవిస్తున్న ఢిల్లీ సీఎం అరవింద్
- ఘనంగా స్వాగతం పలికిన ఆప్ నాయకులు

## త్వరలో ట్రాన్స్‌జెండర్లకు కొత్త బాధ్యతలు



- సీఎం రేవంత్ రెడ్డి వినూత్న ప్రయోగం..!
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో వాలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ
- హెూమ్ గార్డ్స్ తరహాలో వారికి ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకోవాలని సీఎం సూచన
- రోడ్ల అభివృద్ధి, ఫుట్ పాత్ నిర్మాణాలు, ఇతర పనులను గడువులోపు పూర్తిచేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లదే

హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లి చరిత్ర సృష్టించబోతోంది. రాష్ట్రంలోనే తొలి గ్రామంగా రికార్డ్ నెలకొల్పేందుకు రెడీ అవుతోంది. ఇప్పటికే అధికారులు సర్వే కూడా చేపట్టారు. హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ సమస్యలను సులభతరం చేయడానికి ముఖ్యమంత్రి ముందుకొచ్చిన - మిగతా3లో




### బిన్ లాడెన్ కొడుకు బతికే ఉన్నాడు?

- సంచలన విషయం వెలుగులోకి!
- ఉత్తర ఆఫ్ఘనిస్థాన్‌లో తలదాచుకుంటున్నాడన్న 'ది మిర్రర్' కథనం
- 450 మంది స్నైపర్లు అతడికి నిరంతరం భద్రత ఇస్తున్నారని వెల్లడి
- 2019లో అమెరికా వైమానిక దాడిలో మరణించినట్టు గతంలో వెలువడిన కథనాలు

## వయోవృద్ధులకు మోదీ ఆపన్నహస్తం



- వారికి ప్రధాని మోదీ రూ.5 లక్షల ఆరోగ్య బీమా కల్పించారు: కిషన్ రెడ్డి
- పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడా లేకుండా ప్రయోజనం కలుగుతుందన్న కేంద్రమంత్రి
- ఈ పథకం కోసం ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇస్తామన్న కిషన్ రెడ్డి
- రానున్న రెండేళ్లలో ఈ పథకంపై రూ.3,437 కోట్లను కేంద్రం ఖర్చు చేయనుంది

ఢిల్లీ

70 ఏళ్లు దాటిన వారందరికీ ప్రధాని నరేంద్రమోదీ రూ.5 లక్షల ఆరోగ్య బీమాను కల్పించారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రధాని మోదీ ఆపన్న హస్తం అందించారన్నారు. అందుకే ఈ ఆరోగ్య బీమాను తీసుకువచ్చారని తెలిపారు. దీంతో పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడా లేకుండా 6 కోట్ల మంది వయోవృద్ధులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. రానున్న రెండేళ్లలో ఈ పథకంపై - మిగతా3లో




### రాహుల్ వ్యాఖ్యలు ఆందోళనకరం

- రిజర్వేషన్లను తొలగించాలనేది రాహుల్ గాంధీ ఆలోచనే..!
- భారత్ గురించి చెడుగా మాట్లాడటం అలవాటుగా మారింది
- కేంద్ర మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్
- భారత్ వ్యతిరేకి ఇల్హర్ ఒమర్‌తో రాహుల్ భేటీ అయ్యారు

# బిన్ లాడెన్ కొడుకు బతికే ఉన్నాడు?

అమెరికా వైమానిక దాడిలో 2019లో చనిపోయాడని భావించిన ఒసామా బిన్ లాడెన్ కొడుకు హమ్జా బిన్ లాడెన్ సజీవంగా ఉన్నాడని 'ది మిర్రర్' సంచలన కథనాన్ని ప్రచురించింది. అతడు ఉగ్ర సంస్థ అల్ ఖైదాకు నాయకత్వం వహిస్తున్నట్టు ఇంటెలిజెన్స్ నివేదికల ద్వారా తెలిసిందని పేర్కొంది. హమ్జా తన సోదరుడు అబ్దుల్లా బిన్ లాడెన్‌తో కలిసి ఆఫ్ఘనిస్థాన్‌లో ఉండి అల్ ఖైదాను రహస్యంగా నిర్వహిస్తున్నాడని పేర్కొంది. ఎన్ఎంఎఫ్ (నేషనల్ మొబిలైజేషన్ ఫ్రంట్) అనే తాలిబాన్ వ్యతిరేక మిలిటరీ కూటమి కూడా హమ్జా, అతడి అనుచరులు నిర్వహిస్తున్న కార్యకలాపాలను వివరిస్తూ ఒక నివేదికను విడుదల చేసింది. హమ్జాను 'ఉగ్రవాద యువరాజు'గా అభివర్ణించింది. అతడు ఉత్తర ఆఫ్ఘనిస్థాన్‌లో దాక్కున్నాడని, ఏకంగా 450 మంది స్నైపర్లు అతడికి నిరంతరం రక్షణ ఇస్తున్నారని తెలిపింది. 2021లో ఆఫ్ఘనిస్థాన్ పతనం తర్వాత ఆ దేశం వివిధ ఉగ్రవాద గ్రూపులకు ట్రైనింగ్ సెంటర్‌గా మారిందని ఎన్ఎంఎఫ్ నివేదిక అప్రమత్తం చేసింది. "హమ్జా బిన్




లాడెన్‌ను దారా అబ్దుల్లా ఖేల్ జిల్లాకు తరలించారు. అక్కడ 450 మంది అరబ్బులు, పాకిస్థానీలు అతడికి రక్షణ కల్పిస్తున్నారు. అతడి ఆధ్వర్యంలో అల్ ఖైదా మళ్లీ రూపు దిద్దుకుంటోంది. భవిష్యత్‌లో పాశ్చాత్య దేశాల లక్ష్యాలపై దాడులకు సిద్ధమవుతోంది" అని పేర్కొంది. ఒసామా బిన్ లాడెన్ హత్య తర్వాత అల్ ఖైదా బాధ్యతలు చేపట్టిన అల్-జవహిరితో హమ్జా సన్నిహితంగా కార్యకలాపాలు కొనసాగించినట్టు భావిస్తున్నట్టు పేర్కొంది. కాగా 2019లో అమెరికా జరిపిన వైమానిక దాడిలో హమ్జా మరణించాడని అంతా భావించారు. అమెరికా, ఇతర దేశాలపై దాడులు చేస్తామంటూ అతడు ఆడియో, వీడియో సందేశాలు విడుదల చేసిన కొంతకాలం తర్వాత హత్య వార్తలు వెలువడ్డాయి. అయితే మరణించిన ప్రదేశం, తేదీ అస్పష్టంగా ఉన్నాయని బీబీసీ కథనం పేర్కొంది. అమెరికా రక్షణశాఖ పెంటగాన్ కూడా ఈ అంశంపై స్పందించలేదు. కాగా హమ్జా బిన్ లాడెన్‌ను అమెరికా గ్లోబల్ టెర్రరిస్ట్‌గా గుర్తించింది. ఇరాన్‌లో గృహ నిర్బంధంలో ఉన్నట్లు భావిస్తున్నట్టు గతంలో ప్రకటించింది. ఇదిలావుంచితే హమ్జా తండ్రి ఒసామా బిన్ లాడెన్‌ను 2011లో పాకిస్థాన్‌లోని అబోటాబాద్‌లో అమెరికా భద్రతా బలగాలు అంతమొందించాయి. ఓ కాంపౌండ్‌లో తలదాచుకుంటున్న అతడిని అమెరికా ప్రత్యేక దళాలు హతమార్చాయి. 2001 సెప్టెంబర్ 11 న అమెరికాలో ఉగ్రదాడులకు పాల్పడి 3,000 మంది అమాయుల మరణానికి అతడు కారణమైన విషయం తెలిసిందే.

# జైలు నుంచి అరవింద్ కేజ్రీవాల్ విడుదల

**ఢిల్లీ :** లిక్కర్ స్కాం కేసులో కొంతకాలంగా జైలు శిక్ష అనుభవిస్తున్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం సాయంత్రం తిహార్ జైలు నుంచి విడుదలయ్యారు. దాదాపు అయిదున్నర నెలలపాటు ఆయన జైలులో ఉన్నారు. ఎట్టకేలకు సుప్రీం కోర్టులో శుక్రవారం ఆయనకు ఊరట లభించింది.

సీబీఐ,ఈడీ కేసుల్లో కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ అత్యున్నత ధర్మాసనం తీర్పు వెలువరించింది. కేజ్రీవాల్‌కు బెయిల్ వచ్చిందనే సంబరాల నడుమ.. ఆప్ నేతలు, కార్యకర్తలు తిహార్ జైలుకు భారీగా చేరుకున్నారు. ఆయన బయటకు రాగానే పూలదండలతో స్వాగతం పలికారు. స్వీట్లు పంచుకుని, టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

సమన్ల నుంచి బెయిల్ వరకు

అక్టోబర్ 2023: మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు తొలిసారి సమన్లు జారీ చేసిన ఈడీ.

నవంబర్ 2, 2023: ఈడీ సమన్లను పక్కన పెట్టి మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలిలో ర్యాలీలో పాల్గొన్న సీఎం కేజ్రీవాల్.

డిసెంబర్ 2023: ఢిల్లీ మద్యం కుంభకోణంలో సీఎం కేజ్రీవాల్‌కు ఈడీ రెండోసారి సమన్ల జారీ చేసింది. ఇది రాజకీయ ప్రేరేపితం, అక్రమమంటూ దానిని సైతం సీఎం కేజ్రీవాల్ పక్కన పెట్టారు.

జనవరి 2024: ఈ కుంభకోణంలో ఈడీ ముచ్చటగా మూడోసారి సీఎం కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసింది. కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందంటూ ఆ సమన్లను సైతం పక్కన పెట్టిన సీఎం కేజ్రీవాల్.

జనవరి 18, 2024: ఢిల్లీ మద్యం కుంభకోణంలో ప్రశ్నించేందుకు తమ ఎదుట హాజరుకావాలంటూ ఈడీ వరుసగా నాలుగోసారి సీఎం కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసింది.



ఫిబ్రవరి 02, 2024: ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఐదువ సారి, ఆరవసారి జారీ చేసిన ఈడీ సమన్లను సైతం సీఎం కేజ్రీవాల్ విస్మరించారు. ఈ సమన్ల వ్యవహారంలో చట్టబద్ధతపై సీఎం కేజ్రీవాల్.. తన న్యాయవాద బృందంతో సంప్రదింపులు జరిపారు.

మార్చి 16, 2024: సమన్లకు హాజరు కావడంలో విఫలమైనందుకు ఈడీ దాఖలు చేసిన రెండు ఫిర్యాదులపై సెషన్స్ కోర్టు సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసింది.

మార్చి 21, 2024: ఈడీ సమన్లు జారీ చేయడంపై బలవంతపు చర్యల నుంచి రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సీఎం కేజీవాల్. అందుకు నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు.

మార్చి 21ఎం, 2024: ఇదే అంశంపై సీఎం కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

మార్చి 21, 2024: తాము జారీ చేసిన తొమ్మిది సమన్లకు సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పందించలేదన్న ఈడీ. ఈ నేపథ్యంలో సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన ఈడీ.

మే 10, 2024: లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారానికి అనుమతి ఇస్తూ.. సుప్రీంకోర్టు సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 1వ తేదీ తిరిగి తీహాడ్ జైల్లో లొంగిపోవాలని సీఎం కేజ్రీవాల్‌కు స్పష్టం చేసిన సుప్రీంకోర్టు.

జూన్1, 2024: మధ్యంతర బెయిల్ కోసం ఢిల్లీ కోర్టును ఆశ్రయించిన సీఎం కేజ్రీవాల్

జూన్ 02, 2024: సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో తీహాడ్ జైల్లో లొంగిపోయిన సీఎం కేజ్రీవాల్

జూన్ 05, 2024: ఆరోగ్య కారణాల దృష్ట్యా సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిన ఢిల్లీ కోర్టు

జూన్ 20, 2024: మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన ఢిల్లీ కోర్టు.

జూన్ 21, 2024: సీఎం కేజ్రీవాల్‌ను బెయిల్‌పై జైలు నుంచి విడుదల ఉత్తర్వులను నిలిపి వేయాలంటూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఈడీ.

జూన్ 26, 2024: సీఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన సీబీఐ.

సెప్టెంబర్ 05, 2024: కేజ్రీవాల్ అరెస్ట్‌ను సవాల్ చేస్తూ.. మద్యం కుంభకోణం కేసులో తనకు బెయిల్ ఇప్పించాలంటూ సీఎం కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ.. తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు.

సెప్టెంబర్ 13, 2024: సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు

# మాండ్యలో మత ఘర్షణలు: ప్రభుత్వం సీరియస్.. పోలీసులపై వేటు

**బెంగళూరు :** కర్ణాటకలోని మాండ్య జిల్లాలో నాగమంగళ పట్టణంలో నవరాత్రులు సందర్భంగా వినాయకుడి ఊరేగింపు నేపథ్యంలో మత ఘర్షణలు తలెత్తడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. వినాయకుడి ఊరేగింపు సందర్భంగా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ప్రభుత్వం అభిప్రాయపడింది. అలాగే నిఘా విభాగం సైతం విఫలమైందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో స్థానిక ఎస్ఐ అశోక్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. అలాగే నిఘా విభాగానికి చెందిన ఉన్నతాధికారి శరత్ చంద్రని బదిలీ చేసింది. అతడి స్థానంలో కొత్తగా హేమంత్ నింబాల్కర్‌ను నియమించింది. మరోవైపు నాగమంగళ పట్టణంలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా భారీగా పోలీసులను మోహరించారు. మరోవైపు ప్రస్తుతం పట్టణ పరిసర ప్రాంతాల్లో శాంతి భద్రతలు పూర్తిగా అదుపులోనే ఉన్నాయని జిల్లా ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. బుధవారం నాగమంగళ పట్టణంలో.. వినాయకుడి ఊరేగింపు జరుగుతుంది. ఈ ఊరేగింపు మసీద్ సమీపంలోకి వచ్చింది. అకస్మాత్తుగా ఈ ఊరేగింపుపై కొందరు వ్యక్తులు రాళ్ల దాడికి దిగారు. దీంతో రెండు వర్గాల మధ్య తొపులాట జరిగింది. అనంతరం తమకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట వినాయకుడి విగ్రహాన్ని నిలిపి ఓ వర్గం ఆందోళనకు దిగింది. అదే సమయంలో పలువురు ఆందోళనకారులు షాపులతోపాటు రహదారిపై వాహనాలకు నిప్పు పెట్టారు. దాంతో 52 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో వారి బంధువులు పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. తమ



వాళ్లు అమయాకులన్నారు. వాళ్లను కారణం లేకుండా అదుపులోకి తీసుకున్నారని వారి బంధువులు ఆరోపించారు. అలాగే ఈ కేసుకు సంబంధించి మరో ముగ్గురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసుల అదుపులో ఉన్న వారి సంఖ్య 55కి పెరిగింది. వారందరికి 14 రోజుల పాటు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. మరోవైపు నాగమంగళ పట్టణంలో మత ఘర్షణలపై స్థానిక ఎంపీ, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి జేడీ కుమార స్వామి స్పందించారు. ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఈ సందర్భంగా ఆయన విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో శాంతి భద్రత పరిస్థితికి ఈ ఘటన అద్దం పడుతుందనేందుకు ఈ ఘటనే సాక్ష్యమని కేంద్ర మంత్రి అభిప్రాయపడ్డారు. శుక్రవారం నాగమంగళలో మంత్రి జేడీ కుమార స్వామి పర్యటించారు. ప్రశాంతంగా వినాయకుడి ఊరేగింపు వెళుతుండగా.. ఈ రాళ్లు ఎక్కడి నుంచి వచ్చాయని ఈ సందర్భంగా ఆయన సందేహం వ్యక్తం చేశారు. నవరాత్రులు సందర్భంగా బదరికొప్పలు గ్రామం నుంచి వినాయకుడిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్నారు. ఆ క్రమంలో నాగమంగళ పట్టణంలోని మసీద్ వద్దకు రాగానే ఈ ఊరేగింపుపై ఓ వర్గం రాళ్ల దాడికి దిగిన సంగతి తెలిసిందే.

# ఆ రెండు చోట్లా కాంగ్రెస్ ప్రభుత్వాలే కొలువుదీరుతాయ్ : సచిన్ పైలట్

జమ్ముకశ్మీర్, హర్యానాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. జమ్ముకశ్మీర్‌లోని 90 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 18 నుంచి అక్టోబర్ 1 వరకు మొత్తం మూడు విడతల్లో పోలింగ్ జరగనుండగా.. హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో అక్టోబర్ 5న పోలింగ్ నిర్వహించనున్నారు. రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను అక్టోబర్ 8న వెల్లడించనున్నారు. ఈ నేపథ్యంలో ఆ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాజస్థాన్ మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ స్పందించారు. ఆ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు భారీ మెజారిటీతో విజయం సాధిస్తాయని, ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తాయని ధీమా వ్యక్తంచేశారు. రెండు రాష్ట్రాల్లోనూ అధికార బీజేపీ ఓటమి ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. హర్యానాలో పార్లమెంట్ ఎన్నికలకు కేవలం కొన్ని రోజుల ముందు బీజేపీ ముఖ్యమంత్రిని మార్చిందని, దాంతో హర్యానాలో బీజేపీ తన ఓటమిని ఒప్పుకున్నట్లయ్యిందని సచిన్ పైలట్ చెప్పారు. కాబట్టి అక్కడ కాంగ్రెస్ సర్కారు కొలువుదీరుతుందని అన్నారు. జమ్ముకశ్మీర్లో గత కొన్నేళ్లుగా ఎన్నో కుట్రలు జరుగుతున్నాయని, కానీ అక్కడి ప్రజలు ప్రజాస్వామ్యాన్ని నమ్ముతున్నారని, కాబట్టి కాంగ్రెస్ పార్టీని,




మిత్రపక్షాలనే గెలిపిస్తారని విశ్లేషించారు.

## రాహుల్ వ్యాఖ్యలు ఆందోళనకరం




కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు భారత్ గురించి చెడుగా మాట్లాడటం అలవాటుగా మారిందని కేంద్ర మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ ఆరోపించారు. ఈసీ వంటి భారత రాజ్యాంగ వ్యవస్థలను కూడా ఆయన తూలనాడుతుంటారని అన్నారు. కేంద్ర మంత్రి శుక్రవారం రాజస్థాన్‌లోని దౌసాలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరగని పక్షంలో విపక్షాలకు అన్ని సీట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. బీజేపీ రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజల్లో రాహుల్ గాంధీ గందరగోళం సృష్టించారని దుయ్యబట్టారు. అసలు రిజర్వేషన్లను తొలగించాలనే ఆలోచన రాహుల్ గాంధీ మెదడులో ఉందనే విషయం ఇప్పుడు వెల్లడైందని మంత్రి పేర్కొన్నారు. కాగా, రిజర్వేషన్ల తొలగింపుపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తప్పుపట్టారు. తేజస్వి బెంగళూర్‌లో శుక్రవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రిజర్వేషన్ల తొలగింపుపై రాహుల్ వ్యాఖ్యలు ఆందోళనకరమని చెప్పారు. రాహుల్ గాంధీ ఎవరెవరితో సమావేశమవుతున్నారో చూస్తే విస్మయం కలుగుతుందని అన్నారు. భారత్ వ్యతిరేకి ఇల్హర్ ఒమర్‌తో రాహుల్ భేటీ అయ్యారని, ఖలిస్తాన్, పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్ ఏజెంట్లతో ఆయన సమావేశాలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. రాహుల్ గాంధీ ఓరోజు ఉగ్రవాదులతో సమావేశమైనా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అన్నారు. కాగా, కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో కేంద్ర ప్రభుత్వం సహా బీజేపీ, ఆరెస్సెస్ లక్ష్యంగా విమర్శలు గుప్పించడం పట్ల కాషాయ నేతలు భగ్గుమన్నారు. విదేశీ గడ్డపై దేశాన్ని అవమానించడం రాహుల్‌కు అలవాటుగా మారిందని మండిపడుతున్నారు. ఇక రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ దినేష్ శర్మ స్పందించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు భారత్ ఎకానమీ ప్రపంచంలో 11వ స్థానంలో ఉండగా ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద 5వ ఎకానమీగా ఎదిగిందని అన్నారు.

## రాష్ట్రపతి జోక్యం కోరుతూ జూనియర్ వైద్యులు లేఖ




**కోల్‌కతా:** ఆర్జీ కర్ ఆస్పత్రి ట్రయినీ వైద్యురాలిపై హత్యాచారం విషయంలో న్యాయం కోరుతూ జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళనలతో తలెత్తిన ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. దీనికి తెరదించేందుకు జోక్యం చేసుకోవాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జూనియర్ వైద్యులు శుక్రవారంనాడు లేఖ రాశారు. నేర తీవ్రత, దానిని కప్పిపుచ్చేందుకు జరుగుతున్న ప్రయత్నాలు, పని ప్రాంతాల్లో భయాలు నెలకొన్న వాతావరణ పరిస్థితుల్లో యావద్దేశం నిష్పాక్షికమైన సత్వర విచారణను కోరుతోందని వైద్యులు తమ లేఖలో రాష్ట్రపతి దృష్టికి తెచ్చారు. ప్రజలు సమష్టిగా తమ భావోద్వేగాలను వెల్లడించేందుకు, బాధితురాలికి సంఘీభావం తెలిపేందుకు, న్యాయం కోరుతూ ఆగస్టు 15వ తేదీన నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో సైతం క్యాండిల్ లైట్ మార్చ్ నిర్వహించారని వివరించారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కొందరు అల్లరిమూక ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలోకి చొరబడి క్యాంపస్‌పై దాడి చేసి ఎమర్జెన్సీ వార్డును ధ్వంసం చేశారని, ఘటన జరిగిన ప్రాంతంలో సాక్ష్యాలు తుడిచిపెట్టే ప్రయత్నం జరిగిందని, ఇంత జరుగుతున్నా పోలీసులు మౌన ప్రేక్షకుల్లా చూస్తుండిపోయారని, గూండాల భయానికి వైద్యులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని పరుగులు పెట్టారని రాష్ట్రపతి దృష్టికి తెచ్చారు. "ఇలాంటి భయానక, నమ్మకం కోల్పోయిన, నిస్సహాయ స్థితిలో జూనియర్ వైద్యులు గత్యంతరం లేని పరిస్థితిలో ఆసుపత్రి ఆవరణలో పనులకు దూరంగా ఉన్నారు. ఇందుకు ప్రతిగా పౌరులకు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. అభయ క్లినిక్స్ పేరుతో పబ్లిక్ గ్రౌండ్స్‌లోనూ, ఇతర ప్రాంతాల్లోనూ వైద్యశిబిరాలను డబ్ల్యూబీజేడీఎఫ్ నిర్వహిస్తోంది. ఉచితంగా హెల్త్ కేర్ సేవలను కొనసాగిస్తోంది. న్యాయం-వైద్యం సమ్మెకు వెళ్లకూడదంటూ భారత ప్రధాన న్యాయమూర్తి మాటలను స్ఫూర్తిగా తీసుకుని ఎన్ని అవరోధాలు ఎదురైనా విధి నిర్వహణను వైద్యులు కొనసాగిస్తున్నారు" అని ఆ లేఖలో జూనియర్ వైద్యులు పేర్కొన్నారు.

**తాజా నివేదకకు సుప్రీం ఆదేశం**

ఆర్జీ కర్ ఆసుపత్రిలో ట్రయినీ డాక్టర్‌పై హత్యాచారం కేసులో దర్యాప్తునకు సంబంధించిన తాజా నివేదికను సెప్టెబర్ 17వ తేదీన తమకు సమర్పించాలని సీబీఐని సుప్రీంకోర్టు తాజాగా ఆదేశించింది. ఆర్జీ కర్ ఆసుపత్రి వద్ద నియమించిన మూడు సీఐఎస్ఎఫ్ కంపెనీలకు వసతి కల్పించాలని కూడా పశ్చిమబెంగాల్ హోం శాఖ సీనియర్ అధికారులు, సీనియర్ సీఐఎస్ఎఫ్ అధికారిని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

## మిథిలాంచల్‌కు ఎన్డీయే మొండిచేయి తేజస్వి యాదవ్




బిహార్‌లో డబుల్ ఇంజన్ ప్రభుత్వం కొలువుతీరినా వీరు మిథిలాంచల్ అభివృద్ధికి చేసిందేమీ లేదని ఆర్జేడీ నేత, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ ఆరోపించారు. బిహార్‌లో తమ ప్రభుత్వం ఏర్పాటైతే తాము మిథిలాంచల్ అభివృద్ధి సంస్థను నెలకొల్పుతామని ఆయన హామీ ఇచ్చారు. మిథిలాంచల్ సర్వతోముఖాభివృద్ధికి ఈ సంస్థ పాటుపడుతుందని చెప్పారు. మరోవైపు ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసుకు సంబంధించి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని తేజస్వి యాదవ్ స్వాగతించారు. ఇక అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ స్వాగతించారు. ఎంతటి నియంతృత్వమైనా ఒకనాటికి సమసిపోక తప్పదని బీజేపీపై ఆయన విరుచుకుపడ్డారు. కేజ్రీవాల్ ఇప్పుడు జైలు నుంచి బయటకు రానున్నారని, ఈరోజు కోసం వేచిచూసిన వారందరికీ అభినందనలు తెలియచేస్తున్నానని, ఇవాళ ప్రజలంతా పండగ జరుపుకుంటారని గోపాల్ రాయ్ పేర్కొన్నారు. నియంతృత్వ పోకడలు ఎంతటి స్థాయిలో ఉన్నా ఏదోఒక రోజు వాటికి చెల్లుచీటీ తప్పదని ఇవాళ ఢిల్లీ సహా, దేశమంతటికీ ఈ తీర్పు ఓ సందేశం పంపిందని ఆయన వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్‌పై పన్నిన కుట్రలన్నీ ఇప్పుడు విఫలమయ్యాయని, కేజ్రీవాల్ జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే భారీ వేడుకలు నిర్వహిస్తామని ఆప్ ఎమ్మెల్యే కుల్దీప్ కుమార్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయడం ఆప్‌నకు భారీ విజయమని అభివర్ణించారు. బీజేపీ రూపొందించిన నకిలీ స్కామ్ ఇప్పుడు బట్టబయలైందని అన్నారు.ఖ

# ఎమర్జెన్సీని తలపించేలా కాంగ్రెస్ పాలన..

-మొదటిపేజీ తరువాయి

ఇంటి మీద దాడి చేయించారని హరీశ్‌రావు తెలిపారు. డీజీపీ అనేది అత్యున్నత స్థాయి, గౌరవప్రదమైన పోస్టు అని, ఈ పదవిలో ఉన్నప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. రేవంత్ రెడ్డి గురించి తెలిసిందేనని... గతంలో ఆయనను హౌస్ అరెస్ట్ చేయడానికి వెళితే పోలీసులను తిట్టారని ఆరోపించారు.

**ఎవరి మీద దాడులు చేయాలని రివ్యూలు చేస్తారా..?**

నిన్న లా అండ్ ఆర్డర్ ఏమైంది నిన్న గాంధీని ఆపొచ్చు కదా..? నిన్న ఆయనను ఆపి ఉంటే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తినేదా..? మరి ఎనిమిది పోలీసు స్టేషన్లు దాటించి, కౌశిక్ రెడ్డి ఇంటి లోపలికి పంపించి దాడి చేయించారు. మరి నిన్న ఎందుకు యాక్ట్ చేయలేదు. దీనికి కారణం సీఎం, డీజీపీ కాదా..? ఇప్పుడేమో సీఎం, డీజీపీ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఎవరి మీద దాడులు చేయాలని రివ్యూలు చేస్తారా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆ వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో కూడా వైరల్‌గా మారాయని పేర్కొన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు మాత్రం పోలీసులకు సహకరిస్తున్నారని తెలిపారు. కాబట్టి రేవంత్ రెడ్డి మాటలను అనుసరించవద్దని కోరారు. తప్పు చేయాలని రేవంత్ చెప్పినా చట్టబద్ధంగా వ్యవహరించాలని హితవు పలికారు. నిన్న అరికెపూడి గాంధీని ఆపకుండా... ఈ రోజు తమను ఆపడం ఏమిటని ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డి ఇంటికి పంపించి దాడి చేయించినప్పుడు లా అండ్ ఆర్డర్ ఏమైందో చెప్పాలన్నారు.


రేవంత్ రెడ్డి విసిరే ప్రతి రాయి తమకు పునాదిరాయిగా మారుతుందన్నారు. రాళ్ల దాడులకు భయపడతామని అనుకుంటే పొరపాటు అన్నారు. పోరాటాలు తమకు కొత్తేమీ కాదన్నారు. తెలంగాణ గురించి బాధ్యతగా ఆలోచిస్తామన్నారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో హైకోర్టు మొట్టికాయలు వేసిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి అన్నీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. ఒక సమస్య నుంచి తప్పించుకోవడానికి మరో సమస్యను సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీకి రాజకీయం కంటే రాష్ట్రం ముఖ్యమన్నారు.

**రాళ్ల దాడి చేసిన వారికి రాచమర్యాదలు..**

నిన్న రాళ్ల దాడి చేసిన వారికి రాచమర్యాదలు చేశారు. పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి బిర్యానీలు, సమోసాలు తినిపించి, ఆ తర్వాత ఎస్కార్ట్ ఇచ్చి ఇంటింకి పంపించారు. కౌశిక్ రెడ్డి మీద దాడి విషయంపై మేం ఫిర్యాదు చేయడానికి వెళ్తే.. అరెస్టు చేసి 2 గంటలు హైదరాబాద్‌లో తిప్పి అర్ధరాత్రి మహబూబ్‌నగర్ జంగిల్‌లో విడిచిపెట్టారు. ఇదేనా పోలీసులు ప్రవర్తించే తీరు.. రాష్ట్రంలో లా అండర్ ఆర్డర్ ఉందా..? అని నిలదీశారు హరీశ్‌రావు.

**ఆ గూండాలను అరెస్టు చేయలేదు..**

వరద బాధితులను పరామర్శించేందుకు బీఆర్ఎస్ నేతలు



వెళ్తే.. ఖమ్మంలో రాళ్ల దాడి చేశారు. పది రోజులైనా దానిపై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు.. ఆ గూండాలను అరెస్టు చేయలేదు. గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్లగొండ వెళ్తే.. బస్సుల మీద కోడిగుడ్లు, రాళ్లతో దాడి చేశారు. సిద్దిపేటలో నా క్యాంపు కార్యాలయం మీద దాడి చేశారు. ఈ ఘటనల్లో ఏ ఒక్క విషయంలో కూడా పోలీసులు యాక్ట్ చేయలేదు. అరెస్టులు చేయలేదు అని హరీశ్‌రావు గుర్తు చేశారు.

**సీఎం నోరు అదుపులో పెట్టుకోవాలి..**

ఈ రాష్ట్ర ముఖ్యమంత్రే రెచ్చగొడుతున్నారు. సీఎం నోరు అదుపులో పెట్టుకోవాలి. ఆయన మాట్లాడే భాష బజారు భాష. పేగులు తీసి మెడలు వేసుకుంటా.. లాగుల్లోకి తొండలు జొరగడుతా.. అని రెచ్చగొట్టేలా రేవంత్ రెడ్డినే మాట్లాడుతున్నారు. రేవంత్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు అనుసరిస్తున్నారు. దానం నాగేందర్, అరికెపూడి గాంధీ కూడా అలానే పని చేస్తారు. పదేండ్లు కేసీఆర్ నాయకత్వంలో వీరిద్దరూ రౌడీల్లా ప్రవర్తించలేదు. రేవంత్ భాష, విధానం వల్ల నాయకులు కూడా అలానే తయారవుతున్నారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**గాంధీని అరెస్టు చేసి ఉంటే ఇది జరిగేదా..?**

మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తే కొట్టండి అని కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారు. లా అండ్ ఆర్డర్ ఎక్కడుంది..? మొదట నీవు రివ్యూ చేసుకో.. మంత్రులను రివ్యూ చేసుకో. ఇవాళ మమ్మల్ని హౌస్ అరెస్టు చేశారు. అదే నిన్న గాంధీని అరెస్టు చేసి ఉంటే ఇది జరిగేదా..? హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను హౌస్ అరెస్టు చేశారు. రేవంత్ వైఖరేంటో ఈ రాష్ట్ర ప్రజలకు అర్థమవుతుంది. ఈ దాడుల కుట్రంతా రేవంత్ రెడ్డి ఎజెండా.. గాంధీ చేసిన దాడిగా పరిగణించడం లేదు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఈ రకమైన నిర్బంధాలు, అణిచివేతలు చూడలేదు. రేవంత్ పాలలో ఎమర్జెన్సీని తలపించే విధంగా ఉందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

**రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా..**
**ప్రభుత్వానికి హరీశ్ రావు సూటి ప్రశ్న**

పదేళ్లపాటు శాంతి భద్రతల సమస్య రాకుండా బీఆర్ఎస్ పాలన సాగిందని.. కానీ ఇప్పుడా పరిస్థితి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్‌లోని నివాసంలో శుక్రవారం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్తోందని.. శాంతిభద్రతలు క్షీణిస్తుండటంపై పెట్టుబడిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. లా అండ్ ఆర్డర్ అదుపుతప్పడానికి సీఎం రేవంత్ రెడ్డి కారణమని విమర్శలు గుప్పించారు.

"శాంతి భద్రతలు అదుపు తప్పడానికి చేసిందంతా చేసి భాగ్యనగరం బ్రాండ్ ఇమేజ్ గురించి రేవంత్ రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి బందోబస్తు ఇచ్చి దాడులు చేయించింది ఎవరు ..? రేవంత్ రెడ్డి, డీజీపీలు కాదా ..? నిన్నటి దాడులు ఎందుకు ఆపలేదు. అది గాంధీ చేసిన దాడి కాదు రేవంత్ రెడ్డి చేసిన దాడి. మమ్మల్ని ఇవాళ హౌజ్ అరెస్ట్ చేశారు. నిన్న గాంధీని ఎందుకు హౌజ్ అరెస్టు చేయలేదు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా. ఖమ్మంలో మా మీద దాడి చేస్తే పది రోజులైనా గుండాల మీద కేసులు పెట్టలేదు. నిన్న జరిగిన దాడికి కర్త,కర్మ, క్రియ అంతా రేవంత్ రెడ్డే. ఆయన డైరెక్షన్ లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి జరిగింది.

ఎమర్జెన్సీ కన్నా దారుణంగా రాష్ట్ర పరిస్థితులు తయారయ్యాయి.కోమటి రెడ్డి వెంకటరెడ్డి రెచ్చగొట్టే విధంగా మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలను కొట్టాలని చెప్పడం దారుణం. ఫిరాయింపులపై ఢిల్లీలో ఒక మాట గల్లీలో ఒక మాట మాట్లాడుతున్నాడు. ఎన్నిక లేకున్నా పీఏసీ చైర్మన్ ను నియమించి ఎన్నిక జరిగిందని రేవంత్ రెడ్డి చెప్పడం దుర్మార్గం. డీజీపీ పదవి చాలా ఉన్నతమైంది. ఆదర్శంగా ఉండాల్సిన డీజీపీ.. రాజకీయ కుట్రలో భాగమై ప్రతిపక్షాల గొంతును నొక్కాలని చూడాలనుకుంటున్నారు. రాహుల్ గాంధీ దేశం బయట స్వేచ్ఛ స్వాతంత్ర్యాల గురించి పాఠాలు చెప్పడం కాదు. తెలంగాణలో ఏం జరుగుతుందో చూడాలి.

రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించి పార్టీ ఫిరాయింపులు జరిగాయి. పీఏసీ చైర్మన్ నియామకం కూడా అలాగే జరిగింది. మీరు మాపై విసిరే రాళ్లే అధికారంలోకి బీఆర్ఎస్ రావడానికి పునాది రాళ్లు. 16వ ఆర్థిక సంఘం గురించి మీరు తప్పుడు లెక్కలు చెబితే, మేము బాధ్యతాయుతంగా బలమైన వాదనను వినిపించాం. ఆంధ్రా నాయకుల మీద రేవంత్ రెడ్డి కపట ప్రేమ వలకబోస్తున్నారు. చిన్న జీయర్ స్వామిని, యాదాద్రి నిర్మాణానికి ప్లాన్ ఇచ్చిన ఆనంద సాయిని ఆంధ్రోడు అని రేవంత్ అన్నారు. మరి దానికి ఏమని సమాధానం చెబుతారు.

పీఏసీ చైర్మన్ పదవికి ఎన్నిక జరిగిందని రేవంత్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదం. ఎలక్షన్ కాదు, సెలక్షన్ ద్వారా ఇది జరిగింది. కరీంనగర్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో నీ పెత్తనం ఏంటని అరికెపూడి గాంధీ.. కౌశిక్ రెడ్డిని ప్రశ్నించారు. దానికి సమాధానంగానే కౌశిక్ రెడ్డి మాట్లాడారు తప్పా? సెటిలర్ల మీద కౌశిక్ కామెంట్ చేయలేదు. ముందు రెచ్చగొట్టింది గాంధీ. ఆయనకు చెప్పిన సమాధానం అది"అని హరీశ్ రావు తెలిపారు. గురువారం జరిగిన తొక్కిసలాటతో తనకు భుజం నొప్పి మొదలైందని.. డాక్టర్లు ఎమ్మారై స్కాన్ తీసి 15 రోజుల పాటు ఫిజియోథెరపీ సూచించారని హరీశ్ వివరించారు.

# అధికారం పోయిందనే అక్కసుతో కుట్రలు

-మొదటిపేజీ తరువాయి

భద్రతలు కాపాడే విషయంలో సీరియస్‌గా వ్యవహరించాలని డీజీపీకి సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠినంగా వ్యవహ రించాలని డీజీపీకి సీఎం రేవంత్ ఆదేశించారు. లా అండ్ ఆర్డర్‌పై సీఎం రేవంత్ ఫోకస్ చేశారు. ఇవాళ లా అండ్ ఆర్డర్‌పై సమీక్ష నిర్వహించను న్నారు. శాంతి భద్రతలను కాపాడే విషయంలో సీరియస్‌గా ఉండాలని డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేలా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారం పోయిందనే అక్కసుతో కొందరు కుట్రలు చేస్తున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. సైబరాబాద్ కమిషనర్లతో డీజీపీ జితేందర్ సమావేశమయ్యారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడ దన్న డీజీపీ శాంతిభద్రతల కు విఘాతం



కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తెలంగాణలో పరిస్థితిని చెడగొట్టేందుకు ప్రయత్నించే వ్యక్తులపై జీరో టాలరెన్స్ ఉంటుందన్నారు. ప్రజలందరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని డీజీపీ విజ్ఞప్తి చేశారు.

**ఇదీ జరిగింది...**

కాగా గత రెండు రోజులుగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మధ్య జెండా జగడం జరుగుతోంది. పార్టీ ఫిరాయింపుల అంశంపై ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. గాంధీ ఇంటికెళ్లి బీఆర్ఎస్ జెండా ఎగరేస్తానని కౌశిక్ శపథం చేశారు. అయితే ఆయనను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అయితే అనూహ్య రీతిలో పాడి కౌశిక్ రెడ్డి విల్లాకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తన అనుచరులను వెంటబెట్టుకొని వెళ్లడం రచ్చకు దారితీసింది. టమాటాలు, కోడిగుడ్లతో దాడి చేశారు. కిటికీలు, కుండీలు ధ్వంసం చేశారు. ప్రతిగా బీఆర్ఎస్ కార్యకర్తలు చెప్పులు విసిరారు. దీంతో గురువారం దాదాపు గంటన్నరపాటు అక్కడి హైటెన్షన్ వాతావరణం నెలకొంది. గాంధీని పోలీసులు అరెస్టు చేసి ఆ తర్వాత విడుదల చేశారు.

## గణేష్ నిమజ్జనానికి 25 వేల మందితో బందోబస్తు



**హైదరాబాద్ :** గణేష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇప్పటికే అనేక వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఈనెల 17న ఖైరతాబాద్ మహాగణపతితో పాటు పెద్ద సంఖ్యలో వినాయాక విగ్రహాలు నిమజ్జనాలు జరుగనున్నాయి. ఇందుకోసం పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ... గణేష్ నిమజ్జనానికి 25 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో గణేష్ నిమజ్జనం జరుగుతుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనం మధ్యాహ్నం 1:30 గంటలలోపు పూర్తి అవుతుందని తెలిపారు. ఈ ఏడాది అదనంగా 10 శాతం వినాయక విగ్రహాలు ఏర్పాటు అయ్యాయన్నారు. అన్నిరకాల విగ్రహాలు కలిపి దాదాపు లక్ష వరకు ఉండొచ్చన్నారు. నాలుగు రోజులుగా హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జనాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 17న వేల సంఖ్యలో వినాయక విగ్రహాల నిమజ్జనం అవుతాయని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

**నిబంధనలు ఇవే..**

గణేష్ నిమజ్జన శోభాయాత్రల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ పోలీసులు శుక్రవారం కీలక నిబంధనలు ప్రకటించారు. నిమజ్జనం రోజున పాటించాల్సిన ముందస్తు నియమాలను వెల్లడించారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను తీసుకెళ్లడానికి అవసరమైన వాహనాన్ని ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజున సౌత్ జోన్ పరిధుల నుంచి విగ్రహాలను తీసుకెళ్లేవారు ముందుగానే బయలుదేరాలని, వాహనానికి ఏసీపీ కేటాయించిన నంబర్‌ను ప్రదర్శించాలని తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ సిటీ పోలీసులు ఎక్స్ వేదికగా కీలక ప్రకటన చేశారు.

## తెలుగు ప్రజలకు వినాయక చవితి కానుక.. కొత్తగా రెండు వందేభారత్ రైళ్లు



వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తెలుగు ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ కానుక అందించారు. ఈ నెల 16న మోదీ రెండు తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా రెండు వందే భారత్ రైళ్లను ప్రారంభించనున్నారు. నాగ్‌పూర్ -హైదరాబాద్, దుర్గ్ %-% విశాఖపట్నం మధ్య ఈ వందే భారత్ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలియజేశారు. ఢిల్లీ తర్వాత హైదరాబాద్ నుంచే అత్యధికంగా వందేభారత్ రైళ్ల అనుసంధానత ఉందని కిషన్ రెడ్డి అన్నారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రధాని మోదీ ఆపన్న హస్తం అందించారని తెలిపారు. '70 ఏళ్లు దాటిన వారందరికీ రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించారు. పేద, ధనిక తేడా లేకుండా ఆరు కోట్ల మంది వయోవృద్ధులకు లబ్ధి చేకూరనుంది. వచ్చే రెండేళ్లలో ఈ పథకంపై రూ.3,437 కోట్లను కేంద్రం ఖర్చు చేయనుంది. తెలంగాణ నుంచి అదనంగా మరో 10 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు లబ్ధి జరగనుంది. 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులందరికీ ఈ పథకం కోసం ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇప్పటికే ఆయుష్మాన్ పరిధిలో ఉన్న కుటుంబాల్లోని 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు అదనంగా ఏడాదికి రూ.5 లక్షల టాప్-అప్ కవర్ ఇవ్వనుంది. వయోవృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న ప్రధాని మోదీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## వయోవృద్ధులకు మోదీ ఆపన్నహస్తం

-మొదటిపేజీ తరువాయి

రూ.3,437 కోట్లను కేంద్రం ఖర్చు చేయనుందన్నారు. దీంతో తెలంగాణ నుంచి మరో 10 లక్షలమంది వయోవృద్ధులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. 70 ఏళ్లు దాటిన వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని వెల్లడించారు. ఇందుకోసం ప్రత్యేక గుర్తింపులు కార్డులు ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ పరిధిలో ఉన్న కుటుంబాల్లోని 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు అదనంగా ఏడాదికి రూ.5 లక్షల టాప్ అప్ కవర్ ఇవ్వనున్నట్లు చెప్పారు. వయోవృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న ప్రధాని మోదీకి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు ప్రధాని మోదీ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కానుక అందించారని కిషన్ రెడ్డి తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 16న మరో రెండు కొత్త వందేభారత్ రైళ్లు ప్రారంభించనున్నట్లు చెప్పారు. నాగపూర్–హైదరాబాద్, దుర్గ్–విశాఖ మధ్య రెండు వందేభారత్ రైళ్లు పరుగులు పెట్టనున్నట్లు చెప్పారు. ఢిల్లీ తర్వాత హైదరాబాద్ నుంచి అత్యధిక వందేభారత్ రైళ్లు నడుస్తున్నట్లు చెప్పారు.

## తక్షణ సహాయం అందించండి



-మొదటిపేజీ తరువాయి


నివారణకు శాశ్వత పరిష్కారం. భవిష్యత్ లో రాష్ట్రంలో వరదల నివారణకు శాశ్వత చర్యలు తీసుకునేందుకు శాశ్వత నిధి ఏర్పాటు చేయాలని కోరారు. శాశ్వత పరిష్కారం కోసం కేంద్రం యాక్షన్ ప్లాన్ ఉండాలని విజ్ఞప్తి చేసారు. తెలంగాణలో వరద నష్టం అంచనాపై సచివాలయంలో కేంద్ర బృందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా తీవ్రనష్టం సంభవించింది. ఈ క్రమంలో వరద నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్రబృందం ఏపీ, తెలంగాణలలో పర్యటించింది. కేంద్రబృందం సభ్యులు నేడు సచివాలయంలో తెలంగాణ సీఎంతో భేటీ అయ్యారు.

తెలంగాణలో వరదల నివారణకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కోరారు. వరదల నివారణకు శాశ్వత నిధిని ఏర్పాటు చేయాలన్నారు. శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలన్నారు. తెలంగాణలో వరద వల్ల జరిగిన నష్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర బృందం దృష్టికి తీసుకువెళ్లారు. నిబంధనలు లేకుండా తక్షణ సాయానికి నిధులు అందించాలని కోరారు. మున్నేరు వాగుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తే వరద సమస్యకు శాశ్వత పరిష్కారం ఏర్పడుతుందన్నారు.

మానవీయ కోణంలో తెలంగాణను ఆదుకోవాలి : మంత్రి పొంగులేటి

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కేంద్ర బృందం భేటీ అయింది. సచివాలయంలో మంత్రి, అధికారులు బృందంతో వరద నష్టంపై చర్చలు జరిపారు. ఇటీవల కాలంలో సంభవించిన వరదలకు తెలంగాణ రాష్ట్రం తీవ్రస్థాయిలో నష్టపోయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. భారీ వర్షాలకు ప్రధాన రహదారులు, కాలనీలు జలమయమయ్యాయి. అనేక ఇళ్లు నీటిలో మునిగిపోయి ప్రజలు నిరాశ్రయులయ్యారని పేర్కొన్నారు. ఇండ్లు , పంటలు నష్టపోయి ఆర్థికంగా నష్టపోయారు. అన్నీ కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన బాధితులకు మానవీయ కోణంలో కేంద్రం పెద్ద మొత్తంలో సాయం చేసి ఆదుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## త్వరలో ట్రాన్స్‌జెండర్లకు కొత్త బాధ్యతలు..



-మొదటిపేజీ తరువాయి

వినూత్న ఆలోచన ఇప్పుడు హాట్ టాపిక్‌గా ఇంట్రెస్టింగ్‌గా మారింది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీని వాలంటీర్లుగా వినియోగించేందుకు పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆ ఆలోచన ద్వారా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, వారికి సమాజంలో గౌరవం తీసుకురావడమే కాకుండా, నగర ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంలో కూడా ఒక కొత్త మార్గం చూపించినట్లు అవుతుందని భావిస్తున్నారు సీఎం రేవంత్. హోమ్ గార్డ్స్ తరహాలో వారికి ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కూడా అధికారులను సీఎం సూచించారు.

జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లు, ఫుట్ పాత్ ల అభివృద్ధి, శుభ్రత, ఇతర కీలక పనుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా, టెండర్ల ద్వారా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల పనితీరుపై ఆయన నిశితంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లను ఏమాత్రం ఉపేక్షించరాదని సీఎం ఆదేశించారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్ల అభివృద్ధి, ఫుట్ పాత్ నిర్మాణాలు, ఇతర పనులను గడువులోపు పూర్తిచేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లపై ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. అలాగే, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్లపై పూర్తి స్థాయి నివేదికను 15 రోజుల్లోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

తప్పుడు నివేదికలు సమర్పించిన అధికారులపై చర్యలు తప్పవని సీఎం రేవంత్ హెచ్చరించారు. నగరంలో అనేక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి చర్యలు జరుగుతుండగా, అవి సమయానికి పూర్తవ్వడం కోసం తగిన క్రమశిక్షణతో పని చేయాలని సీఎం ప్రత్యేకంగా ఆదేశించారు. ఇక ఇదే సమావేశంలో ముఖ్యమంత్రి ట్రాఫిక్ స్ట్రీమ్‌లైన్ చేయడంలో ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీని వాలంటీర్లుగా వినియోగించేందుకు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ విధానం ద్వారా ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో వాలంటీర్లుగా పనిచేసే ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని సీఎం అభిప్రాయపడ్డారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హోమ్ గార్డ్స్ తరహా ఉద్యోగాలను పరిగణలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. ఆసక్తి ఉన్న వ్యక్తుల వివరాలను సేకరించి, తగిన విధానాలు రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి సూచించిన ఈ కొత్త ఆలోచన ఒకవైపు ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి సమాన అవకాశాలు కల్పిస్తుండగా, మరోవైపు నగర ట్రాఫిక్ సమస్యలపై ఒక పరిష్కార మార్గాన్ని అందిస్తుందని భావిస్తున్నారు.

# సంపాదకీయం

## జాతి ఐక్యతకు దోహదకారి హిందీ

భారత జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏక తాటిపై నడిపి, హిందీ భాష ఆనాడు దోహద పడిందనే భావనతో గాంధీజీ స్ఫూర్తితో, 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగం లోని 351 వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని జాతీయ భాషగా గుర్తిస్తూ పొందు పరిచారు. అప్పటి నుంచి ప్రతి ఏటా నుండి ఈ తేదీని "హిందీ దివస్" (రాష్ట్ర భాషా దినోత్సవం) గా జరుపు కోవడం ఆనవాయితీ. ప్రశంసలు పొందిన భారతీయ పండితుడు, చరిత్ర కారుడు, వేదాంతవేత్త, సాహితీ వేత్త, హిందీ పండితుడు, సర్వోదయ కార్యకర్త, గాంధేయ వాది, పాత్రికేయుడు, రాజకీయ నాయకుడు, సంస్కృత భాషపై సాధికారికత కలిగిన, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన బీయాహర్ రాజేంద్ర సింహ్, 1949 సెప్టెంబర్ 14 న తన 50 వ పుట్టిన రోజున, హిందీని అధికారిక భాషగా స్వీకరించిన తరువాత వారి ప్రయత్నాలు ఫలించాయి. ఈ మేరకు హిందీకి అనుకూలంగా బియాహర్ రాజేంద్ర సింహాతో పాటు హజారీ ప్రసాద్ ద్వివేది, కాకా కలేల్కర్, మైథిలి శరణ్ గుప్త మరియు సేథ్ గోవింద్ దాస్ చేసిన కృషికి కృతజ్ఞతలు తెలుపుతూ భారత రాజ్యాంగ సభ భారతదేశ రిపబ్లిక్ యొక్క రెండు అధికారిక భాషలలో దేవనాగరి లిపిలో వ్రాయబడిన ఒకటిగా హిందీని రాజ్యాంగ సభ ఆమోదంతో స్వీకరించింది. 1949 సెప్టెంబరు 14వ తేదీన హిందీని జాతీయ భాషగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించగా, ఈ నిర్ణయం 1950 జనవరి 26 న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం ఆమోదించింది. భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 343 ప్రకారం, దేవనాగరి లిపిలో వ్రాసిన హిందీని అధికారిక భాషగా స్వీకరించారు. మొత్తం మీద, భారత దేశంలో 22 షెడ్యూల్డ్ భాషలు ఉన్నాయి, వాటిలో రెండు అధికారికంగా యూనియన్ స్థాయిలో ఉపయోగించ బడతాయి: హిందీ, ఇంగ్లీష్. అధికారిక భాష హిందీ దేవనాగరిక లిపి నుంచి రూపొందించ బడింది. ఈ భాష ఇండో యూరోపియన్ భాష సంతతికి సంబంధించిన ఇండో–ఆర్యన్ శాఖకు చెందినది. హిందీ అంటే "పర్షియన్ కానుక" అని అర్థం. హిందీ" మరియు "హిందూ" అనే పదాలు పాత పర్షియన్ కు చెందినవి, ఇవి "సింధు నది"ని సూచించే సంస్కృత పేరు సింధు నుండి వచ్చాయి. దీని అర్థం " హింద్ (భారత దేశం) యొక్క లేదా చెందినది". హిందీ భాష చాలా వరకూ సంస్కృతం నుంచి గ్రహించ బడినది. అయితే కాలక్రమంలో ఉత్తర భారతదేశం లోని ముస్లిం ప్రభావం వల్ల పర్షియన్, అరబిక్, టర్కిష్ పదాలు హిందీలో చేరి ఉర్దూ భాష ఆవిర్భవించింది. మనం శుద్ధ హిందీ(ప్యూర్ హిందీ) భాషను రేడియోలలో, టి.వి. వార్తలలో వినవచ్చు. ప్రస్తుతం చలామణిలో ఉన్న హిందీ భాష చాలా వరకూ సులభతరం చేయ బడింది. ఉత్తర భారత దేశంలో ఇస్లామిక్ పరిపాలన వచ్చిన తరువాత, పాత హిందీ పెర్షియన్, అరబిక్ నుండి అనేక రుణ పదాలను సంపాదిం చింది. ఇది హిందూస్థానీ అభివృద్ధికి దారి తీసింది. అవధి మరియు బ్రజ్ భాష వంటి సాహిత్య ప్రామాణీ కరణ ద్వారా హిందీ బెల్ట్ యొక్క వివిధ మాండలికాలు మరియు భాషలు ప్రాముఖ్యతను సంతరించు కున్నాయి. మొఘల్ కాలం (1800 లు) చివరి భాగంలో భాషా ప్రతిష్టను పొందింది. ఆధునిక హిందీ మరియు దాని సాహిత్య సంప్రదాయం 18 వ శతాబ్దం చివరిలో ఉద్భవించింది. ముందుగా దీనిని ఉత్తర భారత దేశం యొక్క భాషగా (ప్రస్తుత పాకిస్తాన్ తో సహా ) బ్రిటిష్ వలస వాదులు మరియు స్వదేశీ ప్రజలు స్వీకరించారు. 19 వ శతాబ్దం చివరలో, ఉర్దూ నుండి వేరుగా ఉన్న హిందూస్థానీ యొక్క ప్రామాణిక రూపంగా హిందీని మరింత అభివృద్ధి చేసే ఉద్యమం ఏర్పడింది. జాతిపిత మహాత్మా గాంధీ కూడా దేశంలో ఐక్యతను తీసుకు రావడానికి ఈ భాషనే వాడేవారు. ఈ భాషను "లాంగ్వేజ్ ఆఫ్ యూనిటి" అనేవారు. 9 రాష్ట్రాల్లో మరియు 3 కేంద్రపాలిత ప్రాంతాలలో అధికార భాష కాగా, 3 రాష్ట్రాల అదనపు అధికార భాష. బీహార్, ఛత్తీస్‌గడ్, గుజరాత్ (అదనపు), హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార?ండ్, మధ్యప్రదేశ్, మిజోరం (అదనపు), రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ (బ్లాక్స్, డివిజన్లు లేదా 10 శాతం కంటే ఎక్కువ జనాభా ఉన్న జిల్లాల్లో) అండమాన్ మరియు నికోబార్ దీవులు, దాద్రా మరియు నగర్ హవేలి, డామన్ దయ్యూ, ఢిల్లీలలో రాజ్య మేలుతోంది.1954 లో, భారత ప్రభుత్వం హిందీ వ్యాకరణాన్ని సిద్ధం చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసిందిబీ కమిటీ నివేదిక 1958 లో "ఎ బేసిక్ గ్రామర్ ఆఫ్ మోడరన్ హిందీ"గా విడుదలైంది. రాతలో ఏక రూపతను తీసుకు రావడానికి, కొన్ని దేవనాగరి అక్షరాల ఆకారాన్ని మెరుగు పరచడానికి మరియు ఇతర భాషల నుండి శబ్దాలను వ్యక్తీకరించడానికి కృషి జరిగింది. ఇతరులు అర్థం చేసు కోవడాన్ని సులభమైన బాష హిందీ ఒక్కటేనని గుర్తు చేశారు. ప్రపంచం లోని చాలా దేశాలలో హిందీ భాషను మాట్లాడుతారు. భారత దేశం వెలుపల, హిందీ మాట్లాడేవారు నేపాల్ లో 8 మిలియన్లు, యూ.ఎస్.ఏ లో 8,63,077, మారిషస్ లో 4,50,170బీ ఫిజీలో 3,80,000బీ దక్షిణాఫ్రికాలో 2,50,292బీ సురినామ్‌లో 1,50,000బీ ఉగాండాలో 1,00,000బీ యునైటెడ్ కింగ్‌డమ్‌లో 45,800బీ న్యూజిలాండ్‌లో 20వేలు, జర్మనీలో 20వేలు, ట్రినిడాడ్ మరియు టొబాగోలో 26వేలు, సింగపూర్‌లో 3 వేలు, మారిషస్, ట్రినిడాడ్, అమెరికా, దక్షిణాఫ్రికా, న్యూజి ల్యాండ్ వంటి చాలా దేశాలలో ఇప్పటికీ హిందీ ముఖ్య భాషగా ఉంది. ఆసియా వెలుపల , భోజ్‌పురి , బిహారీ భాషలు , ఫిజియన్ మరియు ఇంగ్లీష్ ప్రభావంతో అవధి భాష (తూర్పు హిందీ మాండలికం) ఫిజీలో మాట్లాడ బడుతోంది. ఇది ఫిజీలో 1997 రాజ్యాంగం ప్రకారం "హిందుస్తానీ" గా పిలువబడే అధికారిక భాష. అయితే 2013 ఫిజి రాజ్యాంగంలో దీనిని " ఫిజి హిందీ " అని పిలుస్తారు. ఫిజీలో 3.8 లక్షల మంది మాట్లాడు తున్నారు. 2011 నేపాల్ జనాభా లెక్కల ప్రకారం నేపాల్‌లో సుమారు 77,569 మంది హిందీని మొదటి భాషగా, ఇంకా 1,225,950 మంది రెండవ భాషగా మాట్లాడతారు. దక్షిణాఫ్రికాలో రక్షిత భాషగా, రాజ్యాంగం ప్రకారం,దక్షిణాఫ్రికా భాషా బోర్డు ఇతర భాషలతో పాటు హిందీ పట్ల గౌరవాన్ని ప్రోత్సహిస్తున్నది. ఉర్దూ మాట్లాడే చాలా మంది పాకిస్తానీయులకు హిందీ అర్థం చేసుకోవడం చాలా సులభం. ఇది హిందీ మాదిరిగానే హిందూస్థానీ భాష యొక్క ప్రామాణిక రిజిస్టర్‌బీ ఆధునిక హిందీ నేడు 250 మిలియన్లకు పైగా ప్రజలకు మొదటి భాషగా, 1.8 బిలియన్ల ప్రజలు మాట్లాడే భాషగా ఉంది. అంటే దేశంలో 1/8 వ ప్రజలు ఉపయోగించే భాషగా, దేశాన్ని ఏకం చేసే భాషగా హిందీ గుర్తించ బడుతోంది. జాతీయ భాషగా వర్ధిల్లుతోంది. హిందీ నేర్చు కోవడానికి చాలామంది ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆర్టికల్ 351 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు తమకు నచ్చిన భాషలో పని చేయడానికి స్వేచ్ఛను కలిగి ఉన్నాయి. స్థానికేతర హిందీ మాట్లాడే వారిపై బలవంతపు రుద్దడానికి విస్తృతమైన ప్రతిఘటన, ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో (తమిళనాడు వంటివి) 1963 అధికారిక భాషల చట్టం ఆమోదించడానికి దారితీసింది. ప్రపంచం లోనే ఎక్కువగా మాట్లాడే భాషలలో ఒకటిగా హిందీ భాషకు ప్రత్యేక గుర్తింపు ఉండడం గమనార్హం. అయితే మాతృభాషపై ఉన్న మమకారముతో సంబంధిత రాష్ట్రములలో ప్రతివారికి విద్యా విధానాలు అందాలంటే తప్పని సరిగా మాతృభాష లోనే చదువు కోవాలి. విభిన్న భాషలు ఉన్న భారత దేశములో ఒకరి భావావేశాలు మరొకరు అర్థము చేసు కునేందుకు ఒక కనీస ఉమ్మడి భాష అవసరము ఎంతైనా ఉంది. ప్రపంచ దేశాల ప్రజలతో సంభాషించేందుకు ఇంగ్లీష్ కు ఉన్న ప్రాముఖ్యత మరియేఇతర భాషకు లేదు. ఇంగ్లీష్ నేర్చుకోవడం తప్పనిసరి అవుతున్నది. ఈ విధముగా హిందీయేతర ప్రాంతాలలో మూడు భాషలు నేర్చుకోవడం కష్టతరము, ఇబ్బందులకు హేతువు అవుతుంది. కనుక హిందీని అనవసరముగా నేర్చుకోమని బలవంత పెట్టకూడ దనేది విద్యావేత్తల అభిప్రాయం. నరేంద్ర మోడీ ప్రభుత్వం అందుకే ప్రాథమిక దశలో విద్యార్థులకు మాతృ భాషలో విద్య నేర్చుకునే విషయంపై ప్రధానంగా దృష్టి నిలిపింది.

# రాజకీయ సాహిత్య సవ్యసాచి బూర్గుల

అపర చాణక్యునిగా పేరెన్నిక గన్న దివంగత ప్రధాని పివి నరసింహారావుకు ఆయన గురువు. ఆయన న్యాయవాది, బహుభాషా వేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు, రాజనీతి జ్ఞుడు. హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవస్థాపకుల్లో ఒకరు. సాహితీ వేత్త. బహు భాషా కోవిదులు. రెండు రాష్ట్రాలకు గవర్నరుగా పని చేసిన తొలితరం కాంగ్రెస్ నాయకులు. ఆయనే హైదరాబాద్ రాష్ట్రానికి ప్రజల ద్వారా ఎన్నికైన మొట్టమొదటి, చిట్టచివరి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బూర్గుల రామకృష్ణారావుతో పీవీకి ప్రత్యేక అనుబంధం ఉండేది. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు గురువు ఆయన. బూర్గుల న్యాయవాదిగా పనిచేసే రోజుల్లో ఆయన వద్ద పి.వి. సహాయకునిగా పనిచేయడమే కాకుండా రాజకీయాల్లో ఆయన వారసునిగా ఎదిగారు. రామకృష్ణరావు విళంబి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ విదియ 1899 మార్చి 13 న నరసింగరావు, రంగనాయకమ్మ దంపతులకు కల్వకుర్తి తాలూకా పడకల్లు గ్రామంలో తమ మాతామహులైన వెల్దండ శేషారావు గారి ఇంట జన్మించారు. ఇంటి పేరు పుల్లం రాజు. అయితే స్వగ్రామమైన బూర్గుల నామమే ఇంటి పేరుగా మారింది. ధర్మపంత్ స్కూలు (హైదరాబాద్) లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. 1915లో మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. పూణె లోని ఫెర్గూసన్ కళాశాలలో బీఏ (హానర్స్) డిగ్రీ చదివారు.బొంబాయి విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించి ఎల్.ఎల్.బి. పట్టాను పొందారు. న్యాయశాస్త్ర విద్యార్థిగా ఉన్నప్పుడు ఇండియన్ సోషల్ రీఫార్మర్ పత్రికలో వరకట్న దురాచారాన్ని ఖండిస్తూ ఆంగ్లంలో వ్యాసాలు రాసి పాఠకులు, సంపాదకుల మన్ననలు పొందారు.1922లో ఆంగ్ల ప్రభుత్వం వారు బీరార్ ను నిజాంకు ఇచ్చివేయాలని కూడా పై పత్రికల్లోనూ, ఉర్దూ పత్రికల్లోనూ వ్యాసాలు రాశారు. బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ (లా డిగ్రీ) పూర్తిచేసి, హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. బూర్గుల దగ్గర పివి నరసింహారావు జూనియర్ లాయర్‌గా పనిచేశారు. 1923లో హైదరాబాదులో న్యాయవాద వృత్తి ప్రారంభించి అగ్రస్థాయికి చేరారు. న్యాయవాదిగా ఉంటూనే, రాజకీయాల్లో పాల్గొన్నారు.ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూదానోద్యమం మొదలైన వాటిలో పాల్గొన్నారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారితో కలిసి పనిచేసారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంకు అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేసారు. హైదరాబాదు రాష్ట్ర



కాంగ్రెసు వ్యవస్థాపకుల్లో బూర్గుల ప్రముఖులు. పార్టీ తరపున ఆయన అనేక కార్యక్రమాలకు నేతృత్వం వహించాడు. 1931లో నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన ఆంధ్రమహా సభకు బూర్గుల అధ్యక్షత వహించారు. శాసనోల్లంఘన ఉద్యమం లోను, క్విట్ ఇండియా ఉద్యమం లోను పాల్గొని కారాగార వాసం అనుభవించారు. 1948లో పోలీసు చర్య తరువాత హైదరాబాదు రాష్ట్రం ఏర్పాటు అయి, వెల్లోడి ముఖ్య మంత్రిగా సైనిక ప్రభుత్వం ఏర్పడినపుడు, ఆయన రెవిన్యూ, విద్యాశాఖల మంత్రి అయ్యారు. రెవెన్యూ మంత్రిగా వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి చట్టబద్ధత కల్పించారు. 1952లో మొదటిసారి హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికలు జరిగిపుడు, మహబూబ్ నగర్ జిల్లాలోని షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి హైదరాబాద్ శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి అయ్యారు. పూర్తి మెజారిటీ లేకున్ననూ, మంత్రివర్గంలో సంపూర్ణ సహకారం లేకున్ననూ, పరిపాలన దక్షుడైన ముఖ్య మంత్రిగా పేరుగాంచారు. 1956లో హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలను విడదీసి, కోస్తా, రాయలసీమ లతో కలిపి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు అయినపుడు, కొత్త రాష్ట్రానికి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి కాగా, బూర్గుల, కేరళ రాష్ట్రానికి గవర్నరుగా నియుక్తులై, 1960 వరకు కేరళ గవర్నరుగా పనిచేసి, తరువాత 1962 వరకు ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా కొనసాగారు. 1948 జనవరిలో ప్రభుత్వ ఏజెంట్ జనరల్‌గా హైదరాబాద్ వచ్చిన కె.యం. మున్షీని నిజాం ఆజ్ఞలకు విరుద్ధంగా అందరికన్నా ముందే సందర్శించి పాలకుల ఆగ్రహానికి గురయ్యారు. ఆ సంవత్సరంలోనే హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకులై ప్రజా ఉద్యమానికి సారథ్యం వహించారు. హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం కావడానికి కృషి సల్పిన తీరు విశేషమైనది. రాజకీయ రంగంలోనే కాకుండా సాంఘిక సాంస్కృతిక రంగాల్లో ఆయన చేసిన సేవ ప్రత్యేకమైనది. ఖాదీ బోర్డు విచారణ సంఘం, మధ్యప్రదేశ్ విషయ పరిశీలన సంఘం, ఆంధ్రప్రదేశ్ భారత్ సేవక సమాజం అధ్యక్షులుగా ఉన్నారు. చరిత్ర, శాస్త్ర విజ్ఞానాల తెలుగు ఉర్దూ అకాడమీ, భారతీయ విద్యాభవన్, ప్రశాంతి విద్వత్ పరిషత్ అధ్యక్షులుగా విశేష సాంస్కృతిక సేవలందించారు. క్లాసికల్ లాంగ్వేజి కమిషన్ సభ్యులుగా, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, సంస్కృత పరిషత్‌ల ఉపాధ్యక్షులుగా భాషా సేవలు అందించారు. ఆయన అనేక భాషలలో నిష్ణాతులు. అవన్నీ ఆయన సొంతంగా, ఆసక్తితో నేర్చుకున్నవే. అర్ధరాత్రి వరకు ఫైళ్లలో నిమగ్నమై, తర్వాత బూర్గుల సంస్కృతంలో మునిగి తేలేవారు. బూర్గుల బహు భాషావేత్త, సాహితీవేత్త. తెలుగు, హిందీ, ఆంగ్లం, కన్నడ, మరాఠీ, ఉర్దూ, పారశీక, సంస్కృత భాషల్లో బూర్గులకు ప్రావీణ్యం ఉంది. మహారాష్ట్రలో చదివే రోజుల్లోనే ఆంగ్లంలో కవితలు, సానెట్లు, వ్యాసాలు రాసి కాలేజీ సంచికలో ప్రచురించారు. థామస్ గ్రే ఎలిజీని 'మృత సంస్కృతి' పేరుతో స్వతంత్ర రచన అనిపించే విధంగా అనువదించారు. ఆంగ్ల భాషలో ఆయన స్వయంగా రచించిన భావగీతాలు 'ద డ్రీమ్ ఆఫ్ పొయెట్రీస్ అండ్ అదర్ పోయెమ్స్' పేరుతో వెలువడ్డాయి. పారశీక వాఙ్మయ చరిత్ర ఆయన రచనలలో పేరు పొందినది. జగన్నాథ పండితరాయల లహరీ పంచకమును, శంకరాచార్యుల సౌందర్య లహరి, కనకధారా స్తవమును తెలుగులోకి అనువదించారు. కృష్ణ శతకం, సంస్కృతంలో శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం, శారదస్తుతి, గౌరీస్తుతి, వాణీస్తుతి, లక్ష్మీస్తుతి, శ్రీకృష్ణాష్టకం, రెడ్డి రాజుల కాలం–మత సంస్కృతులు (పరిశోధనా వ్యాసం) మొదలైనవి ఆయన ఇతర రచనలు. అయన రచించిన వ్యాసాలు 'సారస్వత వ్యాస ముక్తావళి' పేరుతో అచ్చయింది. పండిత రాజ పంచామృతం, కృష్ణశతకం, వేంకటేశ్వర సుప్రభాతం, నర్మద్.గీతాలు, పుష్పాంజలి, తొలిచుక్క (కవితలు), నివేదన (కవితలు), పారశీక వ్మాయ చరిత్ర మొదలైన గ్రంథాలు వెలువరించడమే కాకుండా ఎన్నో కావ్యాలకు పీఠికలు రాశారు. అనువాద రచనలు కూడా చేశారు. వానమామలై, కాళోజీ, దాశరథి, నారాయణరెడ్డి ప్రోత్సాహంతో 'తెలంగాణ రచయితల సంఘం' ఏర్పాటు చేసి సాహితీలోక ప్రసిద్ధులైనారు. ఆయనకు1953లో ఆంధ్ర విశ్వ విద్యాలయం అయనకు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవపట్టాను ప్రదానం చేసింది.1956లో ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టర్ ఆఫ్ లాస్ అనే పట్టాను ఇచ్చింది. బూర్గుల 1967, సెప్టెంబర్ 14 న గుండె పోటుతో మరణించారు.

# తెలుగు జాతికి గాడిచర్ల సేవలు

ఆంధ్రులలో మొట్టమొదటి రాజకీయ ఖైదీగా పేరుపొందిన గాడిచర్ల హరిసర్వోత్తమ రావు (సెప్టెంబర్ 14, 1883 – ఫిబ్రవరి 29, 1960) స్వాతంత్ర్య సమర యోధుడిగా, పత్రికా రచయితగా, సంపాదకులుగా, సాహితీకారుడిగా, గ్రంథాల యోద్యమ నాయకుడిగా ఆయన తెలుగు జాతికి బహుముఖ సేవలు అందించారు. ఆంగ్ల పదం ఎడిటర్‌కు సంపాదకుడు అనే తెలుగు పదాన్ని ప్రవేశపెట్టిన వ్యక్తి.ఎం.ఏ డిగ్రీ పొందిన ఆంధ్రులలో ఆయన రెండవ వారు. 1883 సెప్టెంబర్ 14 న కర్నూలులో భాగీరథీ బాయి, వెంకటరావు దంపతులకు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు జన్మించారు . వారి పూర్వీకులు కడప జిల్లా, సింహాద్రిపురం గ్రామానికి చెందినవారు. వారిది పేద కుటుంబం. కర్నూలు, గుత్తి, నంద్యాలలో ప్రాథమిక, ఉన్నత విద్య చదివారు. ఇంకా చదువుకునే ఆర్థికస్తోమత లేకున్నప్పటికీ, ప్రతిభా పారితోషికాల సహాయంతో 1906లో మద్రాసు లో ఎం.ఏ డిగ్రీ పూర్తి చేసారు. తరువాత రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతుండగా,1907లో స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రవేశించారు. రాజమండ్రిలో బిపిన్ చంద్ర పాల్ చేసిన ఉపన్యాస స్ఫూర్తితో విద్యార్థులంతా వందేమాతరం బ్యాడ్జిలు ధరించి తరగతికి వెళ్ళారు. వారికి నాయకుడైన సర్వోత్తమ రావును కళాశాల నుండి బహిష్కరించడమే కాక, ఆయనకు ఎక్కడా ఉద్యోగమివ్వ రాదని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తరువాత ఆయన పత్రికా రంగంలోకి అడుగు పెట్టారు. స్వరాజ్య అనే తెలుగు పత్రికను ప్రారంభించి, బ్రిటిషు పాలనపై విమర్శలు ప్రచురించేవారు. 1908లో తిరునెల్వేలిలో పోలీసు కాల్పుల్లో ముగ్గురు మరణించినపుడు "క్రూరమైన విదేశీ పులి" అనే పేరుతో ఆయన రాసిన సంపాదకీయంపై ప్రభుత్వం కోపించి, ఆయనకు మూడేళ్ళ ఖైదు విధించింది. ఆ విధంగా ఆయన ఆంధ్రులలో ప్రప్రథమ రాజకీయ ఖైదీ అయ్యారు. వెల్లూరు జైలులో, బందిపోట్లు, గజదొంగలూ ఉండే గదిలో ఆయనను బంధించి, అమానుషంగా వ్యవహరించింది, బ్రిటిషు ప్రభుత్వం. జైలు నుండి విడుదల అయ్యాక కూడా ఆయనపై ప్రభుత్వ నిఘా ఉండేది. ప్రజలు ఆయనతో మాట్లాడటానికి కూడా భయపడేవారు. 1914లో బాల గంగాధర తిలక్



యొక్క హెూం రూల్ లీగ్కు ఆంధ్ర రాష్ట్ర కార్యదర్శిగా విస్తృతంగా ప్రచారం చేసారు. 1924లో కాకినాడలో జరిగిన కాంగ్రెసు సభల సమయంలో హిందూస్థానీ సేవా దళ్ ఏర్పాటులో ఆయన ప్రముఖ పాత్ర వహించారు. 1927లో కాంగ్రెసు అభ్యర్థిగా నంద్యాల నియోజక వర్గం నుండి మద్రాసు కౌన్సిల్ కు ఎన్నికయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యునిగా కూడా పనిచేసారు. 1930 నుండి రాజకీయ కార్యక్రమాలు తగ్గించుకుంటూ, తనకెంతో ప్రీతిపాత్రమైన గ్రంథాలయోద్యమం వైపు దృష్టి మరల్చారు. ఆంధ్ర గ్రంథాలయ సంస్థకు 1934 నుండి జీవితాంతం అధ్యక్షులుగా ఉన్నారు. గ్రంథాలయ కార్యకర్తలకు, వయోజన విద్యా ఉపాధ్యాయులకు ఉపయోగపడే పుస్తకాలు రచించారు, శిక్షణా శిబిరాలు నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. 1952లో జరిగిన అఖిలపక్ష సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. దాని తరపున రాష్ట్రమంతా విస్తృతంగా పర్యటించి ఉద్యమాన్ని తీవ్రతరం చేసారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రమే కాక, సమైక్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు కూడా చూసి, 1960 ఫిబ్రవరి 29 న గాడిచర్ల హరి.సర్వోత్తమ రావు మరణించారు. ఆయన స్మారకార్థం విజయవాడలో సర్వోత్తమ భవనం వెలసింది. పత్రికా రచయితగా, సంపాదకులుగా, పుస్తక రచయితగా ఆయన చేసిన కృషి బృహత్తర మైనది. తెలుగుతో పాటు ఇంగ్లీషు, తమిళం, మరాఠీ మొదలైన భాషలు కూడా ఆయనకు వచ్చేవి. ఎం.ఏ చదివే రోజుల్లోనే మొదలైన ఆయన సాహితీ వ్యాసంగం, జీవితాంతం కొనసాగింది. ఎన్నో కొత్త పదాలు సృష్టించారు.ప్రముఖ దినపత్రిక ఆంధ్ర పత్రికకు ఆయన తొలి సంపాదకులుగా, 1916 నుండి 1918 వరకు సంపాదకుడుగా ఉన్నారు.ది నేషనలిస్ట్, మాతృసేవ, ఎడల్ట్ ఎడ్యుకేషన్ రివ్యూ, కౌముది, ఆంధ్రవార్త అనే పత్రికలకు కూడా సంపాదకత్వం నిర్వహించారు. మహిళల సమస్యలు పరిష్కరం కోసం " సౌందర్యవల్లి " అనే పత్రిక నడిపారు. మద్రాసు గ్రామ పంచాయితీ అనే పత్రిక యొక్క తెలుగు, తమిళ, ఇంగ్లీషు ప్రతులకు సంపాదకుడిగా ఉన్నారు. సంపాదకుడు, భావకవిత్వం అనే పదాలను పరిచయం చేసింది కూడా ఆయనే. జి.హెచ్.ఎస్ పేరుతో హిందూ పత్రికకు వ్యాసాలు రాసారు. స్పిరిట్యువల్ స్వదేశీ నేషనలిజం అనే పుస్తకం రాసారు. ఆయన రాసిన శ్రీరామ చరిత్ర అనే పుస్తకాన్ని 11 వ తరగతికి ఉపవాచకంగా ప్రభుత్వం తీసుకున్నది. ఆయన రచించిన పౌరవిద్య అనే పుస్తకాన్ని మద్రాసు ప్రభుత్వం 1 నుండి 6 తరగతుల వరకు పాఠ్య పుస్తకంగా నిర్ణయించింది. వయోజన విద్య అనే తెలుగు పుస్తకాన్ని రచించారు. ఆయన వ్రాసిన అబ్రహాము లింకను చరిత్ర (1907) అనే పుస్తకాన్ని కొమఱ్ఱాజు వెంకటలక్ష్మణరావు సంకలించి విజ్ఞాన చంద్రికా గ్రంథమాలలో భాగంగా ప్రచురించారు. రాయలసీమ కు ఆ పేరు పెట్టింది ఆయనే. 1928లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో రాయలసీమ పేరును గాడిచర్ల, చిలుకూరు నారాయణ రావు చేసిన సూచనతో ఏకీభవించి ఆ పేరు పెట్టారు. అప్పటి వరకు దత్తమండలం అని పిలిచేవారు.

## గెస్ట్ లెక్చరర్లను ఆదుకోవాలి!

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న 1654 మంది అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత లేక అరిగోస పడుతున్నారు.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్స్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతి రిక్రూట్‌మెంట్ సిస్టంకు స్వస్తి పలికి, గెస్ట్ (అతిథి) సిస్టంలో అధ్యాపకుల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ జారీ చేసింది ప్రభుత్వం.ఈ పోస్టుకు త్రీమెన్ కమిటీల ద్వారా డెమో లేదా ఇంటర్వ్యూ నిర్వహించి మెరిట్ ఆధారంగా ఎంపిక చేయడం జరిగింది. అయితే గత పదేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకులతో సమానంగా విధులు నిర్వహిస్తూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతానికి పాటుపడుతూ, నిరుపేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తూ వచ్చిన అతిథి అధ్యాపకుల పరిస్థితి నేడు అగమ్య గోచరంగా మారింది. ప్రతి సంవత్సరం ఇంటర్ కళాశాలలు జూన్ నెలలో ప్రారంభం అవుతాయి. కానీ ఆ విద్యార్థులకు బోధించే గెస్ట్ ఫ్యాకల్టీనీ ఆటో రెన్యువల్ చేయకుండా, ఒక సంవత్సరం జూలైలో, మరో సంవత్సరం ఆగస్టులో అధికారులకు ఇష్టం ఉన్నట్టు విధుల్లోకి తీసుకొని నెలంతా బోధించిన పీరియడ్‌ల ప్రకారం ఒక్కో పిరియడ్‌కు రూ. 390 చొప్పున, నెలకు 72 పిరియడ్‌ల కు రూ. 28,080 మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ వేతనాన్ని సైతం ప్రతి నెలా కాకుండా, మూడు, నాలుగు నెలలకు ఒకసారి చెల్లించడం జరుగుతుంది. ఇక ఇతర ఉద్యోగులకు పండగ సెలవులు వస్తే సంబరం, కానీ గెస్ట్ లెక్చరర్లకు, వీరి కుటుంబాలకు మాత్రం ఉపవాసం. ఎందు కంటే పనిదినాలలో మాత్రమే వీరికి వేతనం వస్తుంది. ఈ సెలవులకు వీరికి పైసలురావు. అయినప్పటికీ గత పదేళ్లుగా అష్ట కష్టాలు పడుతూ వీరు కొనసాగుతున్నారు. రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకులతో సమానంగా రోజంతా పనిచేస్తూ, చాలీచాలని జీతాలతో తమ బతుకులను వెళ్లదీస్తూ, ఉద్యోగం ఒక్కటే దిక్కు అనే ఉద్దేశంతో పనిచేస్తున్నప్పటికీ, ప్రతి విద్యాసంవత్సరం ప్రభుత్వం వీరికి ఆటో రెన్యువల్ చేయకపోవడమే కాక, ఎలాంటి ఉద్యోగ భద్రతనూ కల్పించదు. ఒకవేళ రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకులకు బదిలీలు జరిగాయంటే వీరు ఆ స్థానం నుండి వెళ్లిపోవాల్సిందే. రెగ్యులర్ అధ్యాపకులు లేని చోటే వీరి నియామకం జరుగుతుంది కాబట్టి విద్యాసంవత్సరం మధ్యలో బదిలీల వల్ల ఉద్యోగాలు పోయి, మధ్యలో వేరే ఉద్యోగం దొరకక అనేక ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి . ఇక ఇప్పుడు ప్రభుత్వం టీజీపీఎస్సీ ద్వారా నియమించుకునే రెగ్యులర్ జూనియర్ లెక్చరర్ల ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చింది. ఇదే జరిగితే మరికొద్ది రోజుల్లో వీరు ఉద్యోగాల నుండి వైదొలగవలసి వస్తుంది. దీంతో వీరు చేసిన పదేళ్ల శ్రమ వృథా అవ్వడమే కాకుండా, కుటుంబంతో సహా రోడ్డున పడాల్సిన పరిస్థితి. ఏళ్లుగా ఇదే ఉద్యోగంలో ఉండటంతో ఇప్పటికిప్పుడు ఉద్యోగం పోయి వేరే ఉద్యోగం చేయలేని పరిస్థితి. అందుకే ప్రజాసంక్షేమం కోసం పాటుపడే ప్రజా ప్రభుత్వం వీరి బాధను అర్థం చేసుకొని, కొత్త రిక్రూట్మెంట్‌తో సంబంధం లేకుండా, గత పది సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని వేడుకుంటున్నాం.

# వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కద్తాల్ మండల కేంద్రంలోనీ గాంధీ నగర్ గణేష్ మండపం దగ్గర బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షుడు యాట నర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలునిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు భక్తి శ్రద్ధలతో భక్తి మార్గాన పూజలు జరుపుకోవాలి అని, స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడు ప్రజలకు ఉండాలని అన్నారు అనంతరం ఉత్సవ కమిటీ వారు సన్మానం చేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తో కలిసి అన్నా దాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యాక్రమంలో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బిచ్య నాయక్, పి ఎ సి ఎస్ డైరెక్టర్ చేగురి వెంకటేష్, మల్లేష్ గౌడ్, పలాది ఆంజనేయిలు ,సత్యం, జహంగీర్ అల్లీ, గిరిజన నాయకుడు హన్మనాయక్ , రాజు, బాలరాజు, చెనయ్య , చాకలి కృష్ణ, మరియు ఉత్సవ కమిటీ సభ్యులునెత్తి మల్లేష్, సిరిగిరి రవి, సాయిప్రభూ,బిక్షపతి, రమేష్, శ్రీకాంత్ ,శివశంకర్, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం...



**అగ్ని ధారన్యూస్, భీమారం మండలం, సెప్టెంబర్ 13:** జగిత్యాల జిల్లాభీమారం మండల కేంద్రానికి చెందిన వరికుప్పల రాజేందర్ కుమారుడు అనారోగ్యంతో బాధపడుతూ ప్రయివేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకోగా ఆర్థిక సాయం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో మంజూరైన చెక్కును కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బక్కూరి నరేష్ బాధిత కుటుంబానికి శుక్రవారం రోజున అందజేశారు. చెక్కును అందుకున్న సందర్భంగాకుటుంబ సభ్యులు ఆది శ్రీనివాస్ కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్,అనిల్ కుమార్,శేఖర్. రాకేష్, సాగర్,మాజి ఉప సర్పంచ్ రాజు, యువ నాయకులు రఘు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులను నిరసిస్తూ జాతీయ రహదారిపై ధర్నా



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** వెల్దండ మండలంలోని జాతీయ రహదారిపై ప్రభుత్వ అక్రమ ,మాజీ మంత్రి హరీష్ రావు అరెస్టులను నిరసిస్తూ, బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బి ఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పై దృష్టి పెట్టకుండా బిఆర్ఎస్ పార్టీ నాయకుల మీదా దాడులు జరపడం సరి కాదు అన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ ఉద్యమాల నుండి పుట్టిన పార్టీ అని ఎన్ని అక్రమ కేసులు పెట్టిన భయపడదు అన్నారు. ఇప్పటికైనా ప్రజాపాలన మీద దృష్టి పెట్టాలి అన్నారు. ఈకార్యక్రమంలో,మాజీ ఎంపిపి వెంకటయ్య గౌడ్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు చల్లా మధు సూదన్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ నరసింహ,నిరంజన్,యాదగిరి, పాల్గొన్నారు.

# రీజినల్ స్థాయి బాడి బిల్డింగ్,వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం.

## ఎస్వోటు జి.ఎం జి.రఘుపతి



**అగ్నిధార(రామగిరి మండలం) :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రామగుండం అర్జీ త్రీ పరిధిలో అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్ మరియు గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామగిరి మండలం లోనీ స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో సి.ఈ.ఆర్ క్లబ్ నందు ఆర్జి త్రీ ఎ.పి.ఎ,భూపాలపల్లి ఏరియాల క్రీడాకారుల మధ్య రీజినల్ స్థాయి బాడి బిల్డింగ్ మరియు వెయిట్ లిఫ్టింగ్,పవర్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను రామగుండం అర్జీ త్రీ ఏరియా ఎస్వోటు జి.ఎం జి.రఘుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి సంవత్సరం వివిధ క్రీడలలో పోటీలను నిర్వహిస్తుందన్నారు. కావున నిత్యం ఉద్యోగులు సాధన చేస్తూ, నైపుణ్యం సాధిస్తూ ముందుకెళ్లాలన్నారు. అంతేకాకుండా కంపెనీ స్థాయి,కోల్ ఇండియా స్థాయిలలో నిర్వహించు పోటీలలో నైపుణ్యాన్ని ప్రదర్శించి మన రీజియన్ పేరు నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు,ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్ర రెడ్డి, సమ్మయ్య,అధికారుల సంఘం ప్రతినిధి జి.శ్రీనివాస్,గౌరవ కార్యదర్శి వి.సునీల్ ప్రసాద్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్శా శ్రీనివాస్,స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె.వి.నరసింహారెడ్డి,ఇతర నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# లేబర్ కార్డు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు న్యాక్ శిక్షణ తరగతులు



**అగ్నిధార న్యూస్ మంథని :** లేబర్ గుర్తింపు కార్డు కలిగి ఉన్న 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల వారికి గత 15 రోజులుగా న్యాక్ శిక్షణను ఇస్తోంది. నిరుద్యోగ యువతీ యువకులకు మంథని ఎంపీపీ కార్యాలయం ఆవరణలో పెయింటింగ్, డెకరేషన్ లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు శ్రీనివాస్, రాములు తెలిపారు. వీరికి ప్రతిరోజు మధ్యాహ్నం భోజనం తో పాటు రూ. 300 చెల్లిస్తామని అన్నారు. శిక్షణలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అలాగే టి షర్టు,బ్యాగ్, బుక్,పెన్, హెల్మెట్ అందజేశామని తెలిపారు. గత నెల 27న ప్రారంభమైన న్యాక్ ఉచిత శిక్షణ తరగతులు సెప్టెంబర్ 13 తో ముగిశాయని తెలిపారు. వీరికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని అన్నారు.

# నూతన పాటను ఆవిష్కరించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** నిత్యం ప్రజ శ్రేయస్సు కోసం పాటు పడే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పై యువజన కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గం అధ్యక్షులు అనిల్ గౌడ్ రాయించిన నూతన పాటను ఇవాళ హైదరాబాద్ లోనీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి నీవాసంలో వారి చేతుల మీదూగా ఆవిష్కరించడం జరిగింది. ఈకార్యక్రమంలో, యువజన కాంగ్రెస్ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు సంఘం యూత్ అధ్యక్షునిగా సందీప్.



**అగ్నిధార(రామగిరి మండలం):** రామగిరి మండల మున్నూరు కాపు సంఘం యూత్ అధ్యక్షునిగా చీటి. సందీప్ ను రాష్ట్ర మున్నూరు కాపు సంఘం యూత్ అధ్యక్షుడు బండి.సంజీవ్ ఆదేశాలతో జిల్లా యువత అధ్యక్షులు తొగరి.సురేష్ నియమించారు. రామగిరి మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ముచ్చకుర్తి.శ్రీనివాస్ అద్వర్యంలో శుక్రవారం మున్నూరు కాపు సంఘం యూత్ అధ్యక్షుని గా చీటి.సందీప్(నవాబ్ పేట) కు నియామక పత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో నాగేపల్లి ఎక్స్ రోడ్ మాజీ ఉప.సర్పంచ్ చిట్ట%శీ%పల్లి అనిల్,బేగంపేట్ మాజీ ఉప సర్పంచ్ మంతెన చంటి,మైధం సందీప్ అయిందాల రాజ్ కుమార్,బొనగిరి అనిల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ వద్ద జరిగే రైతు ధర్నాను విజయవంతం చేయండి

## – బిఆర్ఎస్ మంథని మండల అధ్యక్షుడు ఏగోలపు శంకర్ గౌడ్



**అగ్నిధార న్యూస్ మంథని :** రైతు రుణమాఫీ కానీ మంథని మండలానికి చెందిన రైతులంతా శనివారం పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని మంథని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏగోలపు శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ టెక్నికల్ సమస్యల పేరుతో రైతులకు రుణమాఫీ కాకుండా అడ్డుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి రైతు రుణమాఫీ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ. 31 వేల కోట్లతో 70 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసి రుణ విముక్తి కల్పిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ. 18 వేల కోట్లు విడుదల చేసి 22 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసి చేతులు దులుపుకుందని ఎద్దేవా చేశారు. టెక్నికల్ సమస్యల పేరుతో జాప్యం చేయకుండా 2 లక్షల రూపాయల లోపు గల రైతులందరికీ రుణాలు మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కానీ రైతులంతా పెద్దపెల్లి కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రైతులను కోరారు.

# 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు దరఖాస్తు చేసుకోవాలి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి):** కల్వకుర్తి మండలం జీడిపల్లి గ్రామపంచాయతీలో జీడిపల్లి గ్రామ ప్రత్యేక పాలన అధికారి,ఉపాధి హామీ ఏవో, ఎస్ సురేష్,ఉపాధి హామీ ఎపిఓ సిహెచ్ రాజు,పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, గ్రామసభ నిర్వహించి,జీడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆరవ ఆర్డినరీ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నిమిత్తం ఫోటోలతో కూడిన ఓటర్ల జాబితాను వార్డుల ప్రకారం గ్రామ ప్రజలు,ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది. ఓటర్ జాబితా పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెల్ల కాగితంపై ఫిర్యాదు చేసి తగిన ఆధారాలతో గ్రామ బి ఎల్ ఓ మరియు గ్రామపంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లకు అందించాలని గ్రామపంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు. జీడిపల్లి గ్రామ స్పెషల్ ఆఫీసర్ సురేష్ మాట్లాడుతూ,త్వరలో ఉపాధి హామీ పనులలో భాగంగా గ్రామంలో గల పలు సమస్యలను గుర్తించి, ఉపాధి హామీ పథకంలో భాగంగా 14 రోజుల పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో, భాగంగా మరుగుదొడ్లు లేని వారికి అవగాహన కల్పించి మరుగుదొడ్లు నిర్మించు కునేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఇంకుడు గుంతలు లేనివారు ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా తగు సూచ నలు చేస్తామని తెలిపారు. అలా గే ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వస్తున్న కారణంగా గ్రామంలో ప్రతి కుటుంబ సభ్యులు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనివారు కూడా పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల ఓటర్ లిస్టు ను రూపొందించడం జరిగిందని,ప్రతి వార్డులోని సభ్యులను గుర్తించి వార్డువైజుగా ఓటర్ లిస్టును నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు ఏవైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సత్వరమే ఆర్డిఓ తో మాట్లాడి పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామసభలో భాగంగా గ్రామంలో నెలకొన్న గ్రామపంచాయతీకి సంబంధించిన భూములపై చెరుగుట్ట,గొడుగురాళ్ల గుట్ట,పోసాని కుంట,ఎర్రకుంట లను ఆర్డీవో మరియు ఎమ్మార్వోల దృష్టికి తీసుకెళ్లి గ్రామపంచాయతీ భూములకు సంబంధించిన(సర్వే చేసి)కొలతలు నిర్వహించి హద్దురాలను ఏర్పాటు చేయాలని జీడిపల్లి గ్రామస్తులు,ప్రజా ప్రతినిధులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. త్వరలో ఎన్నికలు వస్తున్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు ప్రజాప్రతినిధులకు,గ్రామ ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో, జీడిపల్లి గ్రామ స్పెషల్ ఆఫీసర్ సురేష్,ఉపాధి హామీ ఎపిఓ సిహెచ్ రాజు,అంగన్ బడి టీచర్ అనసూయ,ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్, వివో ఏ మల్లేష్ గౌడ్,మాజీ వార్డు సభ్యులు కుంబర్తి రామకృష్ణ ముదిరాజ్,మాజీ ఉపసర్పంచ్ ఎండిఖజా,నాయకులుఆంజనేయులు,కృష్ణయ్య,కిష్టారెడ్డి,గణేష్ గౌడ్,శేఖర్,మాజీ వార్డ్ సభ్యులు శ్రీశైలం,రామస్వామి, వెంకటేష్,మరియుగ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్చాలి.

**అగ్నిధార(రామగిరి మండలం) :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటనరి కాలనీలో బిజెపి నాయకులు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను భవిష్యత్ తరాలకు తెలిసేలా పాఠ్య పుస్తకాలలో చేర్చాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మోలుమురి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆయన స్థానిక రామగిరి మండలం సెంటినరీ కాలనిలో విలేకరులతో మాట్లాడుతూ నిజాం నవాబ్ రజాకార్ల నుండి హైదరాబాద్ కేంద్రంగా నిజాం సంస్థానం ఉండేది దానిలో భాగంగా మహారాష్ట్ర లోని నాలుగు జిల్లాలు కర్ణాటక నుండి మూడు జిల్లాలు ఉండేవి అక్కడి రాష్ట్రాలు ఎప్పటి నుండో సెప్టెంబర్ 17న సమైక్యత విమోచన దినం అధికారికంగా చేస్తుంది. తెలంగాణ వచ్చిన తర్వాత టిఆర్ఎస్ పార్టీ సెప్టెంబర్ 17 చరిత్రను కాల రాసింది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా కొంతమేర ముందుకు వచ్చింది. కానీ అప్పటి ఉద్యమం నిజాం నవాబ్ ఆగడాలు చెప్పడంలో రెండు పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయి. అణగారిన వర్గాల పోరాట ఫలితంగా సాధించుకున్న తెలంగాణలో ప్రతి ఫలాలు అందరి దక్కేలా చూడాలని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన దినోత్సవం మార్చడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే పాఠ్య పుస్తకాలలో చేర్చి భవిష్యత్ తరాలకు తెలంగాణ చరిత్ర తెలియజేయలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆద్యక్షుడు తీగల శ్రీధర్, సీనియర్ నాయకులు మెరుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలి.

## రాజీవ్ ఓం ప్రకాష్ వర్మ డి.డి.ఎం.ఎస్.(ఎలక్ట్రికల్)

**అగ్నిధార(రామగిరి మండలం) :** రామగిరి మండలం రామగుండం అర్జీ త్రీ పరిధిలో గల అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో గల విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, నియమ నిబంధలను అనుసరిస్తూ విధులు నిర్వహించాలని సౌత్ సెంట్రల్ జోన్ టూ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (ఎలక్ట్రికల్) రాజీవ్ ఓం ప్రకాష్ వర్మ అన్నారు.ఆయన రామగుండం అర్జీ త్రీ అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో పర్యటించారు.జి.ఎం. కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాలులో అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన వివిధ గనుల ఎలక్ట్రికల్ విభాగం అధికారులు, సూపర్వైజర్లు, ఎలక్ట్రీషియన్లకు విద్యుత్ భద్రతపై నిర్వహించిన అవగాహణ సదస్సుకు వారు ముఖ్య అతిథిగా హాజరై పలు సలహాలు, సూచనలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యుత్ భద్రతకు సంబంధించిన నియమ నిబంధనలను వివరించారు.అదేవిధంగా సంబంధిత ఉద్యోగులు రక్షణ సూత్రాలను పాటిస్తూ,విద్యుత్తు ఉపకరణాలను ఉపయోగించాలని అన్నారు.గనిలో విద్యుత్తు ఎర్త్ సిస్టమ్ ఎల్లప్పుడూ ఉపయోగంలో ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, యంత్రాలకు అమర్చిన భద్రతా పరికరాలను పనిచేసే విధంగా చూడాలని అన్నారు.పని ప్రదేశంలో జరిగిన చిన్న చిన్న సంఘటనలు జరగబోయే ప్రమాదానికి సంకేతమని,కావున వాటిని గమనిస్తూ, నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తదుపరి వివిధ గనుల అధికారులు, సూపర్వైజర్లు, ఎలక్ట్రీషియన్లకు ఉన్నటువంటి సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో కార్పోరేట్ సేఫ్టీ విభాగం జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్,రామగుండం రీజియన్ సేఫ్టీ విభాగం జనరల్ మేనేజర్ కె.హెచ్.ఎన్.గుప్త, ఆర్జి త్రీ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ఎన్.రాధాక్రిష్ణ, ఎస్వోటు జి.ఎం లు జి.రఘుపతి, బి.సత్యనారాయణ, ఏరియా ఇంజినీర్ కె.యాదయ్య,ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జె.రాజశేఖర్,ప్రాజెక్ట్ అధికారులు కె.నాగేశ్వరరావు, సి.హెచ్.వెంకటరమణ, వివిధ గనుల,విభాగాల అధిపతులు, అధికారులు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి.




## మండల ప్రత్యేక అధికారి దోమ ఆదిరెడ్డి.

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** ఈనెల 16న జరిగే గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మండల ప్రత్యేక అధికారి జిల్లా వ్యవసాయ అధికారి దోమ ఆదిరెడ్డి అన్నారు. శుక్రవారం కమాన్ పూర్ మండలంలోని గుండారం రిజర్వాయర్ లో ఈనెల 16న గణేష నిమజ్జనం చేసే ప్రదేశాన్ని మండల తహసిల్దార్ ఎం వాసంతి కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ ఎంపీడీవో జీ లలిత ఎంపీ ఓ కాట భాస్కర్ లతో కలిసి ప్రదేశాన్ని పరిశీలించారు. సింగరేణి వారు ఇచ్చే క్రేన్ ను ఏ ప్రదేశంలో నిలపాలో చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం చేసే సమయంలో జాగ్రత్తలు వహించాలని గజ ఈతగాళ్లను మాత్రమే నిమజ్జనానికి సహకారాలు తీసుకోవాలని అన్నారు. వేరే వ్యక్తులను క్రేన్ పైకి ఎక్కించకూడదని అన్నారు. సుమారు 100 గణేష్ ల వరకు నిమజ్జనం జరుగుతుందని వివిధ శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు ఆదివారం సాయంత్రం వరకు చేయాలని గ్రామ కార్యదర్శి బచ్చల ప్రసాద్ మరియు గ్రామ కారోబార్ గ్రామ కారోబార్ భీమ రాజును కోరారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు తాజా మాజీ ఉపసర్పంచ్ రాచకొండ చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

# ఏచూరి మరణం పేద, కార్మిక వర్గాలకు తీరని లోటు

## సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్



**అగ్నిధార న్యూస్,( రామగుండం) :** సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పేద, కార్మిక వర్గాలకు తీరని లోటని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వామపక్ష యోధుడు సీతారాం ఏచూరి ఎమర్జెన్సీ సమయంలో హక్కుల కోసం బలంగా పోరాడారని గుర్తు చేశారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నో ప్రజా సమస్యలను సభ ముందుకు తీసుకొచ్చారని తెలిపారు. ఆయన ప్రతీ అడుగు పేదలు, పీడితులు, కార్మికుల పక్షాన వేశారని తెలిపారు. సీతారాం ఏచూరి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబానికి సమతా సైనిక దళ్ పక్షాన సానుభూతి వ్యక్తం చేశారు.

# ప్రజా పాలనను మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం

## మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్





**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కడ్తాల్ మండల కేంద్రంలో మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డికి పాలన అనుభవం లేక బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానం లేక వికృతమైన రాజకీయాలకు తెలియలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఏనాడు ప్రతిపక్ష నాయకుల పై దాడి జరగలేదని సూచించారు. ఇవాళ హరీష్ రావు అక్రమ అరెస్టును నిరసిస్తూ కడ్తాల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి భారీ ర్యాలీగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, రాస్తారోకో నిర్వహించడానికి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.శాంతియుతంగా నిరసన తెలుపడానికి బయలుదేరిన తమను పోలీసులు అక్రమ అరెస్టును పోలీస్ స్టేషన్ తరలించడాన్ని నాయకులు తీవ్రంగా వ్యతిరేకి%శీ%చ్చారు దీంతో పోలీస్ స్టేషన్ ముందు నాయకులు ధర్నాకు దిగారు. ఈ సమయంలో పోలీస్ స్టేషన్ ముందు పోలీసులకు, బీఆర్ఎస్ నాయకులకు తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేలపై దాడి వెనకాల సీఎం రేవంత్ రెడ్డి ఉన్నాడని మండిపడ్డారు. తెలంగాణలో ఒక ఎమ్మెల్యే కే రక్షణ లేనప్పుడు, సామాన్య ప్రజలకు రక్షణ ఎట్లా ఉంటుందని ప్రశ్నించారు. ఈరకమైనటువంటి దుశ్చర్యలు ప్రజా పాలనకు పూర్తిగా విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరుగుతుంటే రక్షణ కల్పించాల్సిన పోలీస్ వ్యవస్థ ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఈ దాడిలో పోలీసులు కూడా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల వ్యవహరించారని మండిపడ్డారు. వెంటనే ఈ వికృతమైనటువంటి రాజకీయాలకు తెరదించకపోతే త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, మండల పార్టీ అధ్యక్షుడు పరమేష్, రైతు కోఆర్డినేటర్ వీరయ్య, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఎంపీటీసీలు లచ్చి రామ్ నాయక్ ,రంగయ్య, ప్రియా రమేష్, మాజీ సర్పంచులు హరిచంద్ నాయక్, యాదయ్య, నరసింహ గౌడ్, లోకేష్ నాయక్, సులోచన సాయిలు, కృష్ణయ్య, లక్ష్మీ కృష్ణ , పూజా, దేవా, మాజీ ఉపసర్పంచులు రామకృష్ణ, శ్రీను, వినో ద్, శారద, పాండు, నాయకులు మంగళపల్లి నరసింహ , బాల కృష్ణ, శ్రీను, పర్వతాలు, గోపాల్, రమేష్, జితేందర్ రెడ్డి, కృష్ణయ్య, శ్రీను, రమేష్, ప్రశాంత్ ,భాస్కర్, దేవా, గణేష్, యాద య్య, కుమార్, వెంకటేష్, అంజాద్ బాబా, మల్లేష్ ,అంజి, శ్రీకాంత్, శ్రీను, గిరి, యాదయ్య, రామకృష్ణ, జైపాల్, రవి, వెం కటయ్య, కుమార్, చందు ,లక్ష్మణ్, రాజు,అర్జున్ ,యాదగిరి, కిషన్, జగన్ ,రాజు ,జమీల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాల సిబ్బంది ఆర్థిక సహాయం.




**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కమాన్ పూర్ మండలంలోని గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు మృతుని కుటుంబానికి 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. ఇటీవలే ఇదే జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న బియాని శివాని తండ్రి చంద్రమౌళి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కళాశాల సిబ్బంది చలించి ఆ పేద కుటుంబానికి అండగా నిలిచి 20వేల ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది. ఆపదల ఆదుకోవడమే ప్రతి ఒక్కరి బాధ్యత అని కళాశాల ప్రిన్సిపాల్ కాశీ మల్ల సుధాకర్ అన్నారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో విద్యార్థిని విద్యార్థులతో పాటు తిక్క రమేష్ జాలిగాం రమేష్ హేమచందర్ బాబురావు రూపా రాణి నగేష్ కృష్ణమోహన్రావు లక్ష్మీ వంశీ సంజీవ్ సురేష్ శేఖర్ తదితరులు తన మానవతా దృక్పథాన్ని చాటి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

# బాల హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో పూజలు అందుకున్న గణపతి




**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని హనుమాన్ టెకిడి చౌరస్తాలో ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుడికి బాల హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో వినాయకుని కి ఘనంగా పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమం కి వాసవి సేవాసమితి జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్ శెట్టి, స్థానిక కౌన్సిలర్ బండారి కృష్ణ లు పాల్గొని స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు లడ్డు ప్రసాదాలు పంపిణీ చేయడం జరిగింది. బాల హనుమాన్ యూత్ కమిటీ సభ్యులు,వినయ్,కుమార్, దిలీప్, అభి,నాగరాజు, శ్రీకాంత్,సూరి తదితరులు పాల్గొన్నారు.

# భౌతిక దేహం కూడా సమాజ సేవకే




**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** కామ్రేడ్ సీతారాం ఏచూరి కుటుంబ సభ్యులు సీతారాం ఏచూరి భౌతిక దేహాన్ని ఆల్ ఇండియా మెడికల్ సైన్సెస్ న్యూఢిల్లీ హాస్పిటల్ వైద్య విద్యార్థుల విజ్ఞాన పరీక్షల కోసం అప్పగించటం గొప్ప ఆదర్శం.. ఈ విధంగా కూడా కామ్రేడ్ ఏచూరిని ఆకాశమంత ఎత్తులో ఉంచారు.ఏ మత ఆచారాలకు సంబంధం లేకుండా చావును సైతం సమాజ పరం చేయటం అంటే ఇదే.ఒక వ్యక్తి మరణించినప్పుడు మన కళ్ళముందే వారి చితి పేర్చి మనము కూడా ఒక కర్ర వేసి దహనం చేయటం ఒక ఆచారం. ఆ సమయంలో మంటల్లో కాలుతున్న మన కుటుంబ సభ్యుల దహనం నుండి వెదజల్లే చప్పుడులు, వాసనలు, తలపగిలే భయంకర శబ్దం భరించలేనటువంటిది. మట్టిలో పూడ్చి పెట్టడం మరో పద్ధతి. మన చేతులతో మోసుకువెళ్లి మన చేతులతో పూడ్చిపెట్టి ఆ శరీరంపై మనమే మట్టి పోయడం కూడా తట్టుకో లేనటువంటి మరిచిపోలే నటువంటిది. ఈ రెండు పద్ధతులు, ఆచారాలు ప్రపంచవ్యాప్తంగా అన్ని మతాల్లో, కులాల్లో ఆచరిస్తున్నారు. ఈ పద్ధతుల వల్ల మనకు గాని సమాజానికి గాని ఉపయోగమేమీ లేదు. పైగా అవి మన జీవితంలో మరిచిపోదామన్నా మర్చిపోలేని జ్ఞాపకాలుగా ఎప్పుడూ మనలను వేధిస్తుంటుంది. అందుకే అవయవ దానం గాని, పూర్తి పార్థివ దేహ దానం కానీ ఒక మంచి పద్ధతి సమాజానికి ఉపయోగపడుతుంది. మరొకరికి ప్రాణం పోస్తుంది.కాబట్టి అభ్యుదయ వామపక్ష శక్తులు సామాజిక స్వచ్ఛంద సంస్థలు .వ్యక్తులు. సామాజిక సేవకులు. ఈ పద్ధతిని అనుసరించటం కోసం తమ కుటుంబ సభ్యులతో పాటు మన స్నేహితులను పరిచయస్తులను దగ్గరి కుటుంబాలను చైతన్య పరచాలి.... దళిత రత్న, సామాజిక సేవకులు డాక్టర్ దేవీ లక్ష్మీ నరసయ్య

# గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కుంకుమ పూజ



**అగ్నిదారన్యూస్ గోదావరిఖని/8ఇంక్లైన్ కాలనీ :** 8 ఇంక్లైన్ కాలనీ గణేష్ నగర్ లోని గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కుంకుమ పూజ కార్యక్రమం పూజ పండితులు పుల్లెల రాజానరసింహశర్మ చే ఘనంగా నిర్వహించడం జరిగింది. కుంకుమ పూజా కార్యక్రమంలో విగ్రహ దాత పెంచాలా సరోజ రాజయ్య దంపతులు, దీపిక తిరుపతిరెడ్డి దంపతులు గుండ స్వరూప, జనగామ రాధిక, తోడేటి మమత, రాణి, సుమ,స్రవంతి దంపతులు మరియు కమిటీ సభ్యులు ఆవుల రాజేష్ యాదవ్, సంపత్, విక్కీ ,కిరణ్ కుమార్, సురేందర్, శ్రీనివాస్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుని నవరాత్రులలో భాగంగా అన్నదాన కార్యక్రమం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి):** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో గణేష్ నవరాత్రులలో భాగంగా రజక సంఘం వినాయక మండపం దగ్గర తాండ్ర తిరుపతయ్య ఆధ్వర్యంలో, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అన్నదాన కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా తలసాని కృష్ణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సన్మానం చేయడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,వినాయకుని అనుగ్రహం తో అందరూ బాగుండాలి అని కోరాతూ, అన్న దాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో, గ్రామ ప్రజలు, గణేష్ మండప నిర్వాహకులు యువకులు పాల్గొన్నారు.

# యూనియన్ ను బాధునం చేస్తే ఊరుకునేది లేదు.

## ఐఎన్టియుసి సి.డబ్ల్యూ ఆర్జి త్రీ జిల్లా అధ్యక్షుడు బండ కిరణ్,

## వైస్ ప్రెసిడెంట్ ఉడుత శంకర్.




**అగ్నిధార(రామగిరి మండలం) :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం పూట గడవడం కోసం ఒక నాయకుడు ప్రభుత్వాన్ని,ఐఎన్టియుసి యూనియన్ ను బదునాం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఐఎన్టియుసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆర్జి త్రీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఉడుత శంకర్ యాదవ్ మరియు జిల్లా అధ్యక్షుడు బండ కిరణ్ హెచ్చరించారు.రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అమాయకు లైన కాంట్రాక్ట్ కార్మికులకు మాయ మాటలు చెప్పి మభ్య పెడుతూ కాలం గడుపుతున్న సదరు బ్రోకర్ నాయకుడు ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి తొమ్మిది నెలలు మాత్రమే గడుస్తుందని,కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఈ ప్రాంతానికి చెందిన ప్రసాద్ ను మినిమం వేజెస్ బోర్డు చైర్మన్ గా నియమించిన విషయాన్ని వారు గుర్తు చేశారు.ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన జనక్ ప్రసాద్ 100 రోజుల్లో కాంటాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.జనప్రసాద్ ఇచ్చిన హామీ 100 రోజుల్లో ఎలాగైనా నెరవేరుతుందని భయపడిన సదరు బ్రోకర్ నాయకుడు దీన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణీత గడువుకు 40 రోజుల ముందు నుండే ప్రభుత్వాన్ని యూనియన్ బదనామ్ చేసేందుకు కుట్రలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.అమాయకులై నటువంటి పార్కులలో పనిచేసే,క్లీనింగ్ చేసే మహిళా కార్మికులను విధుల నుండి తొలగించి వారి వద్ద నుండి రూ 40, 50 వేలు తీసుకొని మళ్ళీ వీధిలోకి చేర్పించడం మానుకోవాలని హితవు పలికారు.గత పది సంవత్సరాల నుండి నీవు కాంట్రాక్ట్ వర్కర్స్ కి ఏమి హక్కులు సాధించావో చెప్పాలని,యూనియన్ పేరు చెప్పుకొని నీ స్వలాభం కోసం కార్మికుల ను రోడ్డు ఎక్కించడం, ధర్నా చేయించడం యజమాన్యాని కి తొత్తుగా మారి కార్మికుల సమస్య లు గాలికి వదిలేయడం సరికాదన్నారు.ఇప్పటికిపాత రోజులు మర్చి పోయి కార్మికులకు సేవ చేస్తా అంటే కార్మికుల కోసం నీతిగా సేవ చేయి అంతే గాని డబ్బులకు కక్కుర్తి పడి కార్మికులను మోసం చేస్తా అంటే ఈ ఏరియా నుండి తరిమేస్తామని వారు హెచ్చరించారు..

# కఠినంగా శిక్షించాలి

# ప్రాణాలు కాపాడే మాకు రక్షణ ఏది..?







**రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి.**

**ఇలాంటి సంఘటనలు పునరుద్ధం కాకుండా చూడాలి.**

**మాకు కుటుంబాలు ఉన్నాయి ఆత్మ అభిమానం ఉంది.**

**మేము దేవుళ్లం కాదు మనుషులమే.**

**ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు పగడాల కాళీ ప్రసాద్ రావు.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి :** గురువారం రోజు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోనీ హాస్పిటల్ ధ్వంసం, డాక్టర్ పై హత్యయత్నానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలంటూ, పెద్దపల్లి జిల్లా ఐఎంఏ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రమాకాంత్ ఆధ్వర్యంలో, జిల్లాలోని డాక్టర్లు వందలాదిగా తరలివచ్చారు. జరిగిన సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని నలుమూల నుండి ఐఎంఏ సభ్యులు తరలివచ్చి ఐఎంఏ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పగడాల కాళీ ప్రసాదరావు మాట్లాడుతూ... వైద్య వృత్తిని దైవముగా భావించే మేము, కావాలని నిర్లక్ష్య వైఖరితో వైద్యం చేయమన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో డాక్టర్ పై హత్యాయత్నానికి పాల్పడ్డ అమానవీయ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కత్తి పట్టుకుని డాక్టర్ వెంబడిస్తూ హత్యాయత్నానికి పాల్పడడం అనేది ఆటవిక చర్య అన్నారు. ప్రాణాలు పోసే మాకు, ప్రాణాలు తీస్తామంటూ వెంటపడి చంపాలనుకోవడం సభ్య సమాజంలో సిగ్గుచేటు అన్నారు. మా ప్రాణాలకు రక్షణ ఏదంటూ ప్రశ్నించారు. మేము దేవుళ్ళం కాదు వైద్యుల%శీ% మాత్రమే అన్నారు.మాకు ఆత్మాభిమానం, కుటుంబం ఉంటుంది అన్నారు. జగిత్యాల జిల్లాలో డాక్టర్ పైన పెట్రోల్ పోసిన సంఘటన మరువకముందే పెద్దపల్లిలో ఏకంగా కత్తి పట్టుకొని చంపడానికి ప్రయత్నించిన దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంఘటనపై వెంటనే స్పందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించినట్లయితే, కేంద్ర ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి దోశలను చట్టపరంగా, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐఎంఏ కార్యాలయం నుండి ర్యాలీగా, నిరసన తెలుపుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్ వరకు వచ్చారు. అనంతరం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడానికి బయలుదేరారు. ఈ నిరసన కార్యక్రమంలో డాక్టర్ మల్లేశం, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ ప్రణీత్, తో పటు పలువురు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



**అగ్నిధార న్యూస్ రంగారెడ్డి జిల్లా :** శుక్రవారం నాడు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ కె.శశాంక అక్టోబర్ నెలలో జరిగే సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవ మరియు అవగాహన సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శశాంక మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రతి పౌరునికి భారత్ వంటి అనేక ప్రజాస్వామ్య దేశాలలో సమాచార హక్కు ప్రాథమిక హక్కులలో భాగంగా అత్యంత విలువైన మానవ హక్కుగా గుర్తించారన్నారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు పథకాల గురించి అవగాహన పెంచుకోవడానికి కూడా సమాచార హక్కు ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు సమాచార హక్కు చట్టాన్ని శక్తివంతమైన సాధనంగా ఉపయోగించాలని అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం సక్రమంగా అమలవుతుందన్నారు. ఈ యొక్క కార్యక్రమానికి హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, విద్యా అధికారులు, పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు, మైనింగ్ అధికారులు,మెడికల్ సిబ్బంది, అంగన్వాడి ఉద్యోగులు మరియు అన్ని శాఖల అధికారుల సమక్షంలో విద్యార్థులకు, యువకులకు సమాజంలో సమాచార హక్కు చట్టం వల్ల కలిగే ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఏ ఏ కార్యక్రమాలు ప్రజలకు అవసరం పడతాయని అవగాహన సదస్సును ఏర్పాటు చేయుటకు జాతీయ మరియు రాష్ట్ర కమిటీ అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం,రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు,ఆర్టీఐ రంగారెడ్డి జిల్లా సభ్యులు రామగళ్ళ శ్రీనివాస్,దొడ్డి రాజు యాదవ్,కాకి శేఖర్,ఉడుగుల మధు, తదితరులు పాల్గొన్నారు.

## సీజన్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని

## డిఎల్పిఓ అమృత అవగాహన కార్యక్రమం



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా న్యాల్ కల్ మండల పరిధిలోని బసంత్ పూర్, కల్బేమల్, మెటల్ కుంట గ్రామాలలో డి ఎల్ పి ఓ, అమృత ఎంపివో సురేష్ కుమార్ తో కలిసి . స్పెషల్ డ్రై డే కార్యక్రమం నిర్వహించారు.శుక్రవారం రోజు ఉదయం గ్రామాల్లో డ్రైడే కార్యక్రమంలో భాగంగా మురికి నీళ్లు లేకుండా ఇంటిచుట్టూ పరి శుభ్రవం ఉంచుకోవాలని వారు సూచించారు. సీజన్ వ్యాధులు రాకుండా ముందస్తుగా జాగ్రత గ ఉండాలని ప్రజలకు అవగాహన కార్యక్రమం కల్పించారు. గ్రామంలో ఏమైనా ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఉంటే వెంటనే పంచాయితీ సెక్రటరీ లకు తెలియజేయాలని కోరారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయితీ సెక్రటరీ లు అమూల్య లక్ష్మి , మాజీ సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదతరులు పాల్గొన్నారు

## కిష్టారంలో ఎమ్మెల్యే పర్యటన

**ఖమ్మం :** సింగరేణి బాధితులకు న్యాయం జరగకపోతే సింగరేణి యాజమాన్యంతో పోరాటానికైన సిద్ధమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి మండలం - కిష్టారం ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల వల్ల గ్రామం కాలనీల్లో సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ వల్ల తీవ్రంగా నష్టపోయిన బాధితుల ఇళ్ళను ఎమ్మెల్యే పరిశీలించి,వారితో మాట్లాడారు.బాంబ్ బ్లాస్టింగ్ శబ్దాలతో పగిలిపోయిన ఇల్లులో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బ్రతుకుతున్న కిష్టారం ప్రజలకు వర్షాలు శాపంగా మారాయన్నారు. బాంబ్ శబ్దాలకు ఇల్లు పై కప్పు లు, ఇంటి గోడలు కూలిపోవటంతో పాటు కిష్టారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో " పునరావాస " కేంద్రం ఏర్పాటు చేశారన్నారు.పునరావాస కేంద్రాల్లో ఉంటున్న కిష్టారం నిరాశ్రయులను సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ... సింగరేణి బాంబు బ్లాస్టింగ్ ల వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని... లేకుంటే సింగరేణితో కొట్లాడేందుకు సిద్ధమని అన్నారు.

## ఆర్టీసీ బస్ స్టాండ్ ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**మిర్యాలగూడ :** నల్గొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కాలినడకన ఆర్టీసీ బస్టాండ్ ను ఆకస్మిక తనిఖీ చేసారు. బస్టాండ్ ఆవరణములో సానిటైజేషన్ , మరుగుదొడ్లు సరిగా లేవని కాంట్రాక్టర్ పై మండిపడ్డారు. తక్షణమే బస్టాండ్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిపో మేనేజర్ కు ఆదేశాలు ఇచ్చారు. ప్రయాణికుల భద్రత పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రైస్ బ్రాన్ ఆయిల్ మిల్లును సందర్శించిన విద్యార్థులు



**అగ్నిధారన్యూస్, సుల్తానాబాద్,సెప్టెంబర్-13 :** రైస్ బ్రాన్ ఆయిల్ ఉత్పత్తి ప్రక్రియను సోషల్ సైన్స్ ప్రాజెక్ట్ లో భాగంగా గురువారం ఇండియన్ పబ్లిక్ పాఠశాల ఎనిమిది, తొమ్మిదవ తరగతి విద్యార్థులకు రైస్ బ్రాన్ ఆయిల్ ఉత్పత్తి ప్రక్రియ అవగాహన కొరకై శ్రీ లక్ష్మి ఆయిల్ మిల్ సందర్శించి సాంఘిక శాస్త్ర ప్రాజెక్టులో భాగంగా బియ్యం, తవుడు నుండి ఆయిల్ వెలికితీసే ప్రక్రియ గురించి తెలుసుకోవడం జరిగింది. ఈ పర్యటన వల్ల రైస్ బ్రాన్ ఆయిల్ ఉత్పత్తి, స్థానిక ఆర్థిక వ్యవస్థలోని దాని ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ, ప్రస్తుతం మార్కెట్ లలో కల్తీ లేని నూనె దొరకడం లేదని, మనం వాడుతున్న నూనెల వల్లే అనేక రకాల రోగాల బారిన పడుతున్నామని, ఈ రైస్ బ్రాన్ ఆయిల్ వాడడం వల్ల మనకు బి కాంప్లెక్స్ విటమిన్ లభిస్తుందని, ఈ నూనెలో కల్తీ ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నిమజ్జనం ప్రశాంతంగా జరుగాలి

**ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి..**

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి :** ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరం లోని రాజరాజేశ్వర వసతి గృహం లో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ కిరణ్ కరే తో కలసి రెవెన్యూ, పోలీస్ పంచాయితీ, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే, విద్యుత్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, మత్స్య శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల గురించి, కమిటీ సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్న అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16, 17 తేదీల్లో కాళేశ్వరం వద్ద గోదావరిలో వినాయక నిమజ్జనానికి భూపాలపల్లి, ములుగు, వరంగల్ జిల్లాల నుండి విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ఠ మైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు యంత్రాంగం సూచనలు పాటించాలని తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలు పర్యవేక్షణకు అధికారులకు విధులు కేటాయించామని ఆయా శాఖల అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారీగా 24 గంటలు విధులు నిర్వహించాలని తెలిపారు. నిమజ్జనం చేయడానికి రెండు పాయింట్లు అలాగే రెండు క్రేన్ లు ఏర్పాటు చేయడం జరిగిందని క్రేన్స్ ద్వారానే విగ్రహాలు నిమజ్జనం జరుగుతుందని తెలిపారు. నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులు జిల్లా యంత్రాగం నిర్దేశించిన ప్రదేశం వరకే అనుమతి ఉంటుందని భక్తులు సహకరించాలని సూచించారు. నిరంతర పారిశుద్య కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. పంచాయితీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ శాఖ ద్వారా భక్తులకు త్రాగునీరు ఏర్పాట్లు చేయాలన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఏదేని సమస్య వచ్చినా విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు ప్రత్యామ్నయ ఏర్పాట్లుతో సిద్ధంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మేఘా సంస్థ ద్వారా రెండు జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. గజ ఈత గాళ్ళు లైఫ్ జాకెట్లు ధరించి సిద్ధంగా ఉండాలని మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ రహదారులపై గుంతలు ఎర్పడ్డాయని మరమ్మతులు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలని తెలిపారు. మరుగుదొడ్లు గుర్తించే విధంగా సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఏదేని సమస్య వస్తే అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు. 9 రోజుల పాటు నైవేద్యాలు అందుకున్న వినాయకుడు గంగమ్మ వడికి చేరుతున్నాడని ఎలాంటి అపశ్రుతులకు అవకాశం లేకుండా భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా నిమజ్జనోత్సవం జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భక్తులు యంత్రాంగం సలహాలు, సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఏర్పాట్లు పర్యవేక్షణ కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. రెండు రోజులు మద్యం విక్రయాలు నిలిపివేయాలని సూచించారు.

ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శోభాయాత్ర కొనసాగే మార్గాలలో పటిష్ఠ మైన నిఘా ఉంటుందని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. భూపాలపల్లి, కాటారం, మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలని, 24 గంటలు పనిచేయు విధంగా అత్యవసర చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆకస్మికంగా తనిఖీ



**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

**అగ్నిధారన్యూస్,పెద్దపల్లి, సెప్టెంబర్ -13:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న సబ రిజిస్టర్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అధిక సంఖ్యలో ప్రజలు వేచి చూడకుండా రిజిస్ట్రేషన్లు , మ్యూటేషన్ డాక్యుమెంట్లను త్వరితగతిన సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రామగుండం సబ్ రిజిస్టర్ కార్యాలయం తరలించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది నిర్వహిస్తున్న విధుల అడిగి తెలుసుకున్న కలెక్టర్ పలు సూచనలు చేశారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి సబ్ రిజిస్టర్ బి కుమార్, రామగుండం సబ్ రిజిస్టర్ తిరుపతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మరో హిట్ దక్కేనా?

నాచురల్ స్టార్ నాని తాజాగా సరిపోదా శనివారం అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం మన అందరికీ తెలిసిందే. ఆగస్టు 29 వ తేదీన విడుదల అయిన ఈ సినిమాబాక్స్ ఆఫీస్ దగ్గర ఇప్పటికే బ్రేక్ ఈవెన్ ఫార్ములాను కంప్లీట్ చేసుకుని లాభాలను అందుకుంటుంది.ఈ మూవీ కి వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించగా ... ప్రియాంక అరుల్ మోహన్ ఈ సినిమాలో హీరోయిన్గా నటించింది. ఈ మూవీ విడుదల అయిన కొన్ని రోజులకే నాని , శైలేష్ కొలను దర్శకత్వంలో హిట్ ది థర్డ్ కేస్ అనే మూవీ కి సంబంధించిన అప్డేట్ ను విడుదల చేశాడు. కొన్ని రోజుల క్రితమే ఈ సినిమాకు సంబంధించిన ఓ చిన్న వీడియోని విడుదల చేయగా దానికి మంచి రెస్పాన్ జనాల నుండి లభించింది. ఇక నాని మరికొన్ని రోజుల్లోనే శ్రీకాంత్ ఓదెలా దర్శకత్వంలో కూడా ఓ మూవీ నీ నాని స్టార్ట్ చేయబోతున్నాడు. ఇలా శిలేష్ కొలను దర్శకత్వంలో ఓ మూవీ , శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ మూవీ కి కమిట్ అయ్యి ఉన్న నాని మరో క్రేజీ దర్శకుడి సినిమాకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. శేఖర్ కమ్ముల తాజాగా నాని ని కలిసి ఒక కథను వివరించినట్లు , అది బాగా నచ్చడంతో నాని , శేఖర్ దర్శకత్వంలో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో నాని సరసన సాయి పల్లవి నీ హీరోయిన్ గా తీసుకోవాలి అని శేఖర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో శేఖర్ దర్శకత్వంలో రూపొందిన ఫిదా , లవ్ స్టోరీ సినిమాలలో సాయి పల్లవి హీరోయిన్గా నటించగా ఈ రెండు మూవీ లు కూడా బాక్స్ ఆఫీస్ దగ్గర మంచి విజయాలను అందుకున్నాయి. ఇక నాని హీరోగా రూపొందిన శ్యామ్ సింగరాయ్ సినిమాలో సాయి పల్లవి హీరోయిన్గా నటించింది. ఈ మూవీ కూడా మంచి విజయం అందుకుంది. ఇలా ఈ హిట్ కాంబోలో మరి కొన్ని రోజుల్లో ఓ మూవీ స్టార్ట్ కాబోతుంది అంటూ ఓ వార్త సోషల్ మీడియాలో అవుతుంది. ఇకపోతే ప్రస్తుతం శేఖర్ కమ్ముల , ధనుష్ హీరో గా రష్మిక మందన హీరోయిన్గా కుబేర మూవీ ని రూపొందిస్తున్నాడు. ఈ మూవీలో టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున ఓ కీలకమైన పాత్రలో కనిపించబోతున్నాడు.



# తాప్సి రెమ్యూనరేషన్ ఎంతో తెలుసా?

సొట్ట బుగ్గల సుందరి తాప్సీ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈమె దర్శకేంద్రుడు కే రాఘవేంద్రరావు దర్శకత్వంలో రూపొందిన ఝుమ్మంది నాదం అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయింది. ఈ సినిమాలో మంచు మనోజ్ హీరోగా నటించాడు. పర్వాలేదు అనే స్థాయి అంచనాల నడుమ విడుదల అయిన ఈ సినిమా బాక్స్ ఆఫీస్ దగ్గర యావరేజ్ విజయాన్ని అందుకుంది. కానీ ఈ సినిమాలో ఈ ముద్దుగుమ్మ మాత్రం తన అందాలను ఓలకబోయడంలో ఏ మాత్రం వెనకడుగు వేయలేదు. దానితో ఈ సినిమా యావరేజ్ అయిన ఈ ముద్దుగుమ్మ తన అందాలతో ప్రేక్షకులను బాగా ఆకట్టుకోవడంతో ఈ సినిమా తర్వాత వరుసగా ఈ బ్యూటీ కి తెలుగులో అవకాశాలు దక్కాయి. తెలుగులో పర్వాలేదు అనే స్థాయిలో కెరీర్ను కొనసాగిస్తున్న సమయం లోనే ఈ బ్యూటీ హిందీ సినీ పరిశ్రమ వైపు అడుగులు వేసింది. అక్కడ ఈమెకు మంచి అవకాశాలు దక్కడం , అలాగే ఈమె నటించిన సినిమాలు దాదాపు సక్సెస్ కావడంతో ఈమె క్రేజ్ అక్కడ బాగా పెరిగింది. ఇకపోతే తాప్సి కమర్షియల్ సినిమాలలో కాకుండా ఎక్కువ శాతం లేడీ ఓరియంటెడ్ సినిమాలలో , వైవిధ్యమైన సినిమాలలో నటిస్తూ వస్తుంది. ఇకపోతే ఈ మధ్య కాలంలో తాపీ కి భారీ విజయాలు లేవు. కానీ ఈ ముద్దుగుమ్మ మాత్రం భారీ స్థాయిలో రెమ్యూనరేషన్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కొంత కాలం ఈ నటి షారుక్ ఖాన్ హీరోగా రాజ్ కుమార్ హిరానీ దర్శకత్వంలో రూపొందిన డంకి అనే సినిమాలో కీలక పాత్రలో నటించింది. ఈ మూవీ కోసం ఈ ముద్దుగుమ్మ ఏకంగా 11 కోట్ల రెమ్యూనిరేషన్ తీసుకున్నట్లు ఓ వార్త వైరల్ అవుతుంది. ఇలా ఈమెకు పెద్ద స్థాయి విజయాలు లేకపోయిన రెమ్యూనరేషన్ మాత్రం పెద్ద మొత్తంలోనే తీసుకుంటున్నట్లు ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

# రకుల్ షాకింగ్ కామెంట్స్?

సినీ సెలబ్రిటీలకు సంబంధించి ఏ విషయం తెరమీదకి వచ్చినా కూడా అది ఇంటర్నెట్లో ఎంత హాట్ టాపిక్ గా మారిపోతూ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ క్రమంలోనే సినీ సెలబ్రిటీల ప్రొఫెషనల్ లైఫ్ కంటే పర్సనల్ లైఫ్ గురించి తెలుసుకునేందుకు ఎక్కువ మంది ఆసక్తిని కనబరిస్తూ ఉంటారు అన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే అందరికీ తెలిసిన సినీ సెలబ్రిటీల గురించి ఎవరికీ తెలియని నిజం బయటకి వచ్చింది అంటే చాలు ఇక ఆ విషయం గురించి అందరూ మాట్లాడుకుంటూ ఉంటారు. ఎంతోమంది హీరోయిన్లు తమ కెరియర్ లో ఎదురైన ఇబ్బందులను బయటకు చెప్పేవారు కాదు. అలా చెబితే ఎక్కడ కెరియర్ నాశనమై అవకాశాలు తగ్గిపోతాయేమో అని భయపడేవారు. కానీ ఈ మధ్యకాలంలో మాత్రమే ఎంతో మంది స్టార్ హీరోయిన్లు ఇలా తమ కెరియర్లో ఎదురైన ఇబ్బందుల గురించి ఓపెన్ గా చెప్పడానికి వెనకడుగు వేయడం లేదు. దీంతో చాలా విషయాలు బయటకు వస్తూ సంచలనంగా మారిపోతున్నాయి. ఇటీవలే స్టార్ హీరోయిన్రకుల్ ప్రీత్ సింగ్ కూడా షాకింగ్ కామెంట్స్ చేసింది. ఇండస్ట్రీలో ఎన్నో రోజులుగా నెపోటీజం కొనసాగుతోంది అంటూ వార్తలు వస్తున్నాయి. ఎంతో మంది స్టార్ల వారసులు, వారి ఫ్యామిలీకి చెందిన వారే బాగా రాణించేందుకు ఇక బ్యాగ్రౌండ్ లేకుండా వచ్చిన వారిని తొక్కేస్తున్నారని.. ఇలాంటి నెపోటిజం వల్ల ఎంతోమంది గొప్ప నటులు కనుమరుగవుతున్నారంటూ అప్పుడప్పుడు వార్తలు కూడా వస్తుంటాయి. అయితే ఇలాంటి నెపోటిజం గురించి ఇటీవల స్టార్ హీరోయిన్రకుల్ ప్రీత్ సింగ్ షాకింగ్ కామెంట్స్ చేసింది. సినిమా ఇండస్ట్రీలో నెపోటిజం వల్ల తాను కొన్ని అవకాశాలు కోల్పోయినట్లు రకుల్ వెల్లడించింది. ఈ విషయంలో తాను ఎప్పుడో బాధపడలేదు అని చెప్పింది. స్టార్ కిడ్స్ కి సినిమాల్లో అవకాశాలు సులభంగా రావడానికి వారు పేరెంట్స్ పడిన కష్టమే కారణం. నేను కూడా నా పిల్లలకి ఫ్యూచర్ లో సహాయం చేస్తాను. లైన్ లో నిలబడి అదృష్టాన్ని పరీక్షించుకోండి అని చెప్పను అంటూ రకుల్ ప్రీత్ సింగ్ చెప్పుకొచ్చింది.



# మరోసారి ఆ ఫ్లాప్ దర్శకుడికి ఛాన్స్?

ప్రస్తుతం తెలుగు సినీ పరిశ్రమలో మంచి జోష్ లో కెరీర్ ను ముందుకు సాగిస్తున్న యువ నటులలో తేజ సజ్జ ఒకరు. ఈయన ఆఖరుగా హనుమాన్ అనే సినిమాలో హీరోగా నటించాడు.ఈ సినిమా పాన్ ఇండియామూవీ గా తెలుగు , తమిళ , కన్నడ , మలయాళ , హిందీ భాషలలో విడుదల అయ్యి అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఈ సినిమాతో తేజ కు ఇండియా వ్యాప్తంగా గుర్తింపు లభించింది. ప్రశాంత్ వర్మ ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. ఇకపోతే హనుమాన్ లాంటి బ్లాక్ బస్టర్సినిమా తర్వాత తేజ ప్రస్తుతం కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న మిరాయ్ అనే సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. ఈ మూవీ భారీ బడ్జెట్లో రూపొందుతుంది. ఇలా అద్భుతమైన స్థాయిలో కెరియర్ను ముందుకు సాగిస్తున్న తేజ తన నెక్స్ట్ మూవీ ని పెద్దగా క్రేజీ లేని దర్శకుడితో చేయబోతున్నట్లు తెలుస్తోంది. అసలు విషయం లోకి వెళితే ... కొంత కాలం క్రితం తేజ "అద్భుతం" అనే ఓ సినిమాలో హీరో గా నటించిన విషయం మనకు తెలిసిందే. ఈ సినిమా థియేటర్లలో కాకుండా నేరుగా ఓ టీ టీ ఫ్లాట్ ఫామ్ లో విడుదల అయింది. ఇక ఈ సినిమాకు ప్రేక్షకుల నుండి పెద్ద స్థాయిలో రెస్పాన్స్ లభించలేదు. ఈ మూవీ కి మల్లిక్ రామ్ దర్శకత్వం వహించాడు. ఇకపోతే మళ్లీ మల్లిక్ రామ్ దర్శకత్వంలో తేజ మరో సినిమా చేయబోతున్నట్లు ఓ వార్త వైరల్ అవుతుంది.





# యాక్షన్ ప్యాక్డ్‌గా 'వెనోమ్ - ది లాస్ట్ డాన్స్' ట్రైలర్

హాలీవుడ్ నుంచి సూపర్ హీరో సినిమాలు వస్తున్నాయంటే ఆ క్రేజ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే తాజాగా మరో సూపర్ హీరో మూవీ రాబోతుంది. సోనీ పిక్చర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మార్వెల్ వారు సంయుక్తంగా రూపొందించిన చిత్రం వెనోమ్. ఇప్పటికే ఈ ఫ్రాంచైజీ నుంచి రెండు సినిమాలు రాగా బ్లాక్ బస్టర్ అందుకున్నాయి. ఇక తాజాగా ఇందులో నుంచి మూడవ భాగం వెనోమ్ %-% ది లాస్ట్ డాన్స్ రాబోతుంది. ప్రముఖ హాలీవుడ్ నటుడు టామ్ హార్డీ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు కెల్లీ మార్సెల్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాను అక్టోబర్ 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ఈ సందర్భంగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఫుల్ యాక్షన్ ప్యాకడ్‌గా సాగిన ఈ ట్రైలర్‌ను మీరు చూసేయండి. ఇక ఇండియాలో ఈ చిత్రాన్ని ఇంగ్లీష్ తో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com